బలితీసుకుంటున్నాయ్..!



ఆస్పరి మండలం చిగిలిలో ఐదో తరగతి చదివే ఆరుగురు విద్యార్థులను బలి తీసుకున్న ఎర్రగరుసు గుంత ఇది.

అక్రమార్కులు ఎక్స్‌కవేటర్లతో కొండల్లో పడ్డారు. ఎర్రగరుసు వారికి ఆదాయ వనరుగా మారింది. ఇష్టారాజ్యంగా తవ్వకాలు చేస్తున్నారు. అక్రమంగా తవ్వకాలు చేసిన క్వారీ గుంతలు పూడ్చేయడం లేదు. రక్షణ చర్యలు తీసుకోవడం లేదు. ఆ గుంతలే నోళ్లు తెరిచాయి. అభాగ్యుల ప్రాణాలు బలితీసుకుంటున్నాయి. ఆస్పరి మండలం చిగిలి గ్రామంలో అక్రమంగా ఎర్రగరుసు క్వారీ తవ్వకాలతో ఏర్పడిన గుంతల్లో అభంశుభం తెలియని ఐదో తరగతి చదువుతున్న ఆరుగురు విద్యార్థులు ఈతకెళ్లి మృత్యువాత పడ్డారు. కర్నూలు, నంద్యాల జిల్లాలో ఎర్రమట్టి, నాపరాతి క్వారీ గుంతల్లో పడి పలువురు మృత్యుఒడి చేరినా అధికార యంత్రాంగం పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. ఎర్రమట్టి అక్రమ తవ్వకాలతో అక్రమార్కులు రూ.లక్షలు దండుకుంటున్నారు. వారికి నియోజకవర్గం ప్రజాప్రతినిధుల అండ ఉండడంతో అధికారులు గాంధారి పాత్ర పోషిస్తున్నారు. అనుమతులు లేని అక్రమ ఎర్రగరుసు క్వారీ గుంతలు ప్రాణాలు తీస్తున్నా పట్టించుకోరా..? ప్రాణాంతకంగా మారిన గుంతలు పూడ్చేయరా..? రక్షణ చర్యలు తీసుకుంటారా..? వీటికి అధికారులే సమాధానం చెప్పాలి. ఆ వివరాలపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

కర్నూలు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల్లో అక్రమంగా క్వారీ తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. ఆదోని, ఆలూరు, ఎమ్మిగనూరు, కోడుమూరు, మంత్రాలయం నియోజకవర్గాల పరిధిలో గత వైసీపీ హయాంలో ఎర్ర గరుసు అక్రమ క్వారీ తవ్వకాలు ఇష్టారాజ్యంగా సాగాయి. నాడు ఎమ్మెల్యేల అండదండలు ఉండడంతో రెవెన్యూ, మైనింగ్ అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరించారు. జిల్లా కేంద్రం కర్నూలు శివారులో జగన్నాథగట్టును రాజకీయ అండతో 'కర్నూలు గ్రావెల్ ఫీల్డ్ (కేజీఎఫ్)గా మార్చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా అక్రమ తవ్వకాలకు చెక్ పడలేదు. జిల్లా అంతటా ఎర్రమట్టి అక్రమ తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. అరికట్టాల్సిన అధికారులు రాజకీయ జోక్యం, మామూళ్ల మత్తులో కళ్లకు గంతలు కట్టుకున్నారనే ఆరోపణలు బలంగా ఉన్నాయి. ఎర్రమట్టి తవ్వకాలు చేపట్టి, నిర్లక్ష్యంగా వదిలేసిన ఆ గుంతలే ప్రాణాలను బలితీసుకుంటున్నాయి. ఉజ్వల భవిష్యత్తు ఉన్న చిన్నారులను మృత్యుకూపంలోకి లాగేస్తున్నాయి.

చిగిలి, బిణిగేరి గ్రామాల మధ్య..

ఆస్పరి మండలం చిగిలి, బిణిగేరి గ్రామాల మధ్య సర్వే నంబరు 195లో 119 ఎకరాలు ఎర్రగరుసు నిక్షేపాలు కలిగిన ప్రభుత్వ భూములు (కొండలు) ఉన్నాయి. ఎర్రగరుసు తవ్వకాలు, అమ్మకాలు ద్వారా కాసుల వేటలో అక్రమార్కులు రాజకీయ అండతో ఇష్టారాజ్యంగా తవ్వకాలు చేపట్టారు. నాడు వైసీపీ హయాంలో నేడు కూటమి నేతల అండదండలతో ఎర్రమట్టి తవ్వకాలు చేపట్టడంతో భారీ గుంతలు ఏర్పడిన గుంతలు వర్షపు నీటితో నిండి నోళ్లు తెరిచిన గుంతలే స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్న పదేళ్ల వయసు కలిగిన ఆరుగురు విద్యార్థులను బలి తీసుకుంది. చిగిలిలో ఒక్కటే కాదు.. కర్నూలు, నంద్యాల జిల్లాల్లో ఎర్రమట్టి, నాపరాతి, గ్రానైట్ రాయి క్వారీ గుంతలు ప్రమాదకరంగా మారాయి. అలాంటి గుంతలను గుర్తించి రక్షణ చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

- నోళ్లు తెరిచిన క్వారీ గుంతలు..
- అక్రమంగా ఎర్రమట్టి తవ్వకాలు..
- ప్రాణాలు తీస్తున్నా పట్టించుకోని వైనం
- కొలిమిగుండ్ల నాపరాతి క్వారీ గుంతలో పడి ఒకరి మృతి
- పదేళ్ల క్రితం కోసిగిలో నలుగురు విద్యార్థులు మృత్యువాత
- తాజాగా చిగిలిలో ఆరుగురు విద్యార్థులను మింగేసిన ఎర్రమట్టి కుంట
- ప్రమాదకర గుంతలను పూడ్చేందుకు చర్యలు ఏవీ?



ఎమ్మిగనూరు మండలం కోటేకల్లు గ్రామ శివారులో ఎల్లెల్సీ కాలువకు వెళ్లే దారిలో ప్రమాదకరంగా క్వారీ గుంత

ఉమ్మడి జిల్లాలో జరిగిన ఘటనలు కొన్ని



- కొలిమిగుండ్ల సమీపంలో నాపరాతి క్వారీ గుంతల్లో చేరిన వర్షపు నీటిలో ప్రమాదవశాత్తు చాంద్‌బాషా పడి ఇటీవల మృతిచెందాడు. కొలిమిగుండ్ల, బనగానపల్లె మండలాల్లో నాపరాత్రి క్వారీ గుంతల దగ్గర ఎలాంటి రక్షణ చర్యలు చేపట్టక పోవడం వల్ల ఐదారేళ్లలో పది మంది నీటి గుంతల్లో పడి మృతి చెందారు.
- ఆదోని మండలం పెద్దహరివాణం గ్రామం మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాల (తెలుగు)కు అతి సమీపంలో ఎస్‌ఎస్ ట్యాంక్ ఉంది. 2023 నవంబరు 19న బడి వేళలో ఐదో తరగతి చదివే మంజునాథ్, అక్బర్ ఇద్దరు విద్యార్థులు సరదాగా స్నానం కోసం వెళ్లి మృత్యుఒడి చేరారు. రక్షణ చర్యలు చేపట్టాలని ఆ గ్రామస్థులు విన్నవించినా పట్టించుకోలేదు.
- మండల కేంద్రం కోసిగి గ్రామానికి అతి సమీపంలో బుగేని చెరువులో అక్రమంగా ఎర్రగరుసు తవ్వకాలతో ఏర్పడిన గుంతల్లో వర్షపు నీరు చేరాయి. పదేళ్ల క్రితం ఆ గుంతల్లో సరదాగా స్నానాలకు వెళ్లిన 5-6వ తరగతి చదువుతున్న నలుగురు విద్యార్థులు నీట మునిగి మృత్యుఒడి చేరారు.
- మంత్రాలయం మండలం చిలకలడోణ గ్రామ సమీపంలోని చెరువు గుంతలో ఏడాదిలో ఇద్దరు పడి మృతిచెందారు. ఐదేళ్ల క్రితం మరో వ్యక్తి కూడా ఆగుంతలో పడి చనిపోయారు. బుదూరులో మూడేళ్ల క్రితం నీటి గుంతలో పడి ఓ చిన్నారి మృతి చెందారు.

మిగతా 6వ పేజీలో

అర్జీల పరిష్కారంలో జాప్యం వద్దు: కలెక్టర్



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల ఎడ్యుకేషన్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): అర్జీల పరిష్కారంలో జాప్యం లేకుండా చూడాలని కలెక్టర్ రాజకుమారి సూచించారు. నంద్యాల కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 334 అర్జీలు వచ్చాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫిర్యాదులను నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించామని చెప్పారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి సంబంధించి బండిఆత్మకూరు, నందికొట్కూరు, నంద్యాల, గోస్పాడు, బనగానపల్లె, చాగలమర్రి మండలాల్లో ఎక్కువ శాతం పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. రీ ఓపన్ కేసులపై ప్రత్యేక దృష్టిసారించి అర్జీదారుడు సంతృప్తి చెందేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో జేసీ విష్ణుచరణ్, డీఆర్వో రామునాయక్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రైతులు ఆందోళన చెందవద్దు : కలెక్టర్

నంద్యాల ఎడ్యుకేషన్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 40,350 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని, రైతులు ఆందోళన చెందవద్దని కలెక్టర్ రాజకుమారి సూచించారు. నంద్యాల కలెక్టరేట్‌లోని పీజీ ఆర్ఎస్ హాల్‌లో యూరియా నిల్వలపై అధికారులతో కలెక్టర్‌తో పాటు జేసీ విష్ణుచరణ్ సమావేశమయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ యూరియా నిల్వల పర్యవేక్షణ కోసం జాయింట్ కలెక్టర్, ఆర్డీవోలు, తహసీల్దార్ల ఆధ్వర్యంలో బృందాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వారంతా రైతు సేవా కేంద్రాలు, ఎరువుల దుకాణాలను తనిఖీ చేసి ప్రతి రోజు రిపోర్ట్ అందజేయాలని కలెక్టర్ ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వం రూ.2,267 విలువ చేసే 50 కేజీల యూరియా ప్యాకెట్‌ను రైతుల శ్రేయస్సు కోసం సబ్సిడీ రూపంలో రూ.2వేలు తగ్గించి కేవలం రూ.267కే అందజేస్తున్నట్లు తెలిపారు. స్వచ్ఛత అవార్డులకు సంబంధించి జిల్లా పరిధిలో ఉత్తమంగా నిర్వహిస్తున్న కార్యాలయాలను ఎంపిక చేసి 55 స్వచ్ఛ అవార్డులను అక్టోబరు 2వ తేదీన ఇవ్వనున్నట్లు తెలిపారు.

పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత: మంత్రి



మట్టి ప్రతిమలను పంపిణీ చేస్తున్న మంత్రి ఫరూక్

నంద్యాల రూరల్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత అని రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ తెలిపారు. సోమవారం పట్టణంలోని కల్పనా సెంటర్‌లో ఏఐఏ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మట్టి వినాయకుల విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ మట్టి విగ్రహాలకు పూజించాలన్నారు. అందరూ వినాయకచవితి పండుగను ఆనందంగా జరుపుకోవాలని, ప్రతి కుటుంబానికి వినాయకుని ఆశీస్సులు ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ప్రతి సంవత్సరం మట్టి వినాయకులను పంపిణీ చేయడం ఆనవాయితీగా వస్తోందన్నారు. అలాగే అధికారులు అన్ని వసతులు కల్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ తులసిరెడ్డి, అడ్వకేట్ రామచంద్ర రావు, బనగానపల్లె బీజేపీ కన్వీనర్ బీవీ సుబ్బారెడ్డి, తహసీల్దార్ శ్రీనివాసులు, టాటా ఏఐఏ అసిస్టెంట్ మేనేజర్ బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

నత్తనడకన రైల్వేస్టేషన్ పునరుద్ధరణ..! 7

అంబటి, శిల్పాపై పరువునష్టం దావా వేస్తా

శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి



ఆత్మకూరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి అంబటి రాంబాబు, మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డిపై పరువునష్టం దావా వేస్తానని శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి అన్నారు. సోమవారం ఆత్మకూరు మార్కెట్ యార్డు ప్రాంగణంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. తాను శ్రీశైలానికి తాగి వచ్చానని వైసీపీ నేతలు అంబటి రాంబాబు, శిల్పా చక్రపాణి రెడ్డిలు ఆరోపించడం సరైనది కాదన్నారు. 'వారేమైనా నాకు పెగ్గు కలిపారా, సోడా పోశారా..' అంటూ తనదైన శైలిలో విరుచుకుపడ్డారు. ఆరోజు తాను దోర్నాల చెక్‌పోస్టు వద్ద రాత్రి 9గంటల్లోపే దాటి వచ్చానని తాను శ్రీశైలానికి సుమారు 10గంటలకు చేరుకునే సమయానికి అటవీ మార్గంలో తనకు పలు వాహనాలు ఎదురయ్యాయన్నారు. దీంతో అక్కడ పని చేస్తున్న అటవీ సిబ్బంది డబ్బులు వసూళ్లు చేసి చెక్‌పోస్టు నుంచి అనుమతించినట్లు తన దృష్టికి రావడంతో శిఖరం చెక్‌పోస్టు వద్ద పనిచేస్తున్న సిబ్బందిని విచారించి వారి ఫొటోలను తాను స్వయంగా తీశానని చెప్పారు. అదేక్రమంలో తమ పార్టీ కార్యకర్త అయిన ఇస్మాయిల్ అనే సిబ్బందితో చనువుగా మాట్లాడే క్రమంలో తాను కొట్టానని కొందరు ప్రచారం చేయడం విడ్డూరంగా ఉందని తెలిపారు. తనపై నిరాధారమైన ఆరోపణలు చేసిన వారిపై పరువునష్టం దావా వేస్తానని హెచ్చరించారు. అటవీ శాఖలో జరిగిన అవినీతి, చెంచులపై వేధింపులపై నివేదిక తయారు చేస్తున్నానన్నారు. ఆ నివేదికను త్వరలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు అందజేస్తానని తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 80 ఫిర్యాదులు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా

నంద్యాల ఎడ్యుకేషన్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా 80 ఫిర్యాదులను స్వీకరించినట్లు ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా తెలిపారు. గడివేముల మండలం గని గ్రామ పరిధిలో తన 3.54 ఎకరాల భూమిలో సాగు చేయనీయకుండా ఎల్‌కే తండాకు చెందిన మధునాయక్ ఇబ్బంది పెడుతున్నాడని జనార్దన్‌నాయక్ ఎస్పీకి ఫిర్యాదు చేశారు. రమేష్‌రెడ్డి అనే వ్యక్తి రూ.70 వేలు తీసుకుని పదిరోజుల్లో ఇస్తానని చెప్పి నేటికీ ఇవ్వకుండా బెదిరిస్తున్నారని నంద్యాల పట్టణానికి చెందిన రవికుమార్ ఆచారి ఫిర్యాదు చేశారు. ఎస్సీ కార్పొరేషన్‌లో రుణం, ఉద్యోగం ఇప్పిస్తానని వహిదా అనే మహిళ రూ.1.75లక్షలు తీసుకుని స్పందించడం లేదని నంద్యాల పట్టణం జ్ఞానాపురానికి చెందిన కుమారి ఎస్పీకి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలు ఇచ్చిన ఫిర్యాదులపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి పరిష్కరిస్తామన్నారు. చట్టపరిధిలో ఉన్న సమస్యలకు తక్షణమే పరిష్కారం చూపాలని, ఫిర్యాదులపై నిర్లక్ష్యం చూపించవద్దని పోలీసు అధికారులను ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు.

28 నుంచి డీఎస్సీ సర్టిఫికెట్ల పరిశీలన

కర్నూలు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ-2025లో ప్రతిభ చూపి ఉపాధ్యాయులుగా ఎంపికైన అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన ఈ నెల 28న ఉదయం 8 గంటల నుంచి ప్రారంభంవుతుందని కర్నూలు డీఈవో ఎస్.శ్యామ్యూల్ పాల్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. శుక్రవారం రాత్రి డీఎస్సీ మెరిట్ జాబితా విడుదలైందన్నారు. ఎంపికైన అభ్యర్థులకు వారి సెల్‌ఫోన్లకు మెసెజ్‌లు ఆదివారం విద్యా శాఖ అధికారులు పంపించారని తెలిపారు. తక్కువ సమయం ఉండడం వల్ల డీఎస్సీ అభ్యర్థుల విన్నపం, వారి వెసులుబాటు కోసం 28వ తేదికి ప్రభుత్వం వాయిదా వేసిందని తెలిపారు. మూడు రోజులు సమయం ఉండడంతో ఎంపికైనట్లు మెసెజ్ వచ్చిన అభ్యర్థులు గురువారం ఉదయం 8 గంటలకు వారికి కేటాయించిన సర్టిఫికెట్ల పరిశీలన కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు.

శ్రీశైలానికి భారీగా వరద

7 గేట్ల నుంచి నీటి విడుదల



జలాశయం గేట్ల నుంచి విడుదలవుతున్న నీరు

నంద్యాల, ఆగస్టు25 (ఆంధ్రజ్యోతి): ఎగువ పరివాహక ప్రాంతాల నుంచి శ్రీశైలం జలాశయానికి వరద కొనసాగుతోంది. 7 క్రస్ట్‌గేట్లను 10 అడుగుల మేర ఎత్తి 2,88,263 క్యూసెక్కులు, శ్రీశైలం కుడి, ఎడమగట్టు జల ఉత్పాదన కింద 62,160 క్యూసెక్కుల నీటిని నాగార్జునసాగర్‌కు విడుదల చేస్తున్నారు. జూరాల, సుంకేసుల, హంద్రీల నుంచి 2,69,917 క్యూసెక్కుల వరద నీరు జలాశయానికి వచ్చి చేరుతోంది. శ్రీశైలం జలాశయం నీటి మట్టం 885 అడుగులు కాగా.. సోమవారం రాత్రి 10గంటలకు 882.10 అడుగులు ఉండగా.. నీటి సామర్థ్యం 215 టీఎంసీలు కాగా.. 199.273 టీఎంసీలుగా నమోదైంది. ఇదిలా ఉండగా.. సాయంత్రం 6 గంటల సమయంలో 9 గేట్లు 10 అడుగుల మేర ఎత్తి నీటిని విడుదల చేశారు. రాత్రి 10 గంటలకు 7 గేట్ల ద్వారా మాత్రమే నీటిని విడుదల చేశారు.



వినాయక విగ్రహాలను తరలిస్తున్న యువకులు



అమ్మకానికి సిద్ధంగా ఉన్న గణనాథులు

మండపాలకు బొజ్జ గణపయ్య

- యువత కోలాహలం
- రేపటి నుంచి ఉత్సవాలు

నంద్యాల కల్చరల్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): కోలాహలంతో కూడిన పండుగ 'వినాయకచవితి'ని ఘనంగా నిర్వహించేందుకు ఉమ్మడి జిల్లా ప్రజలు సిద్ధమయ్యారు. బుధవారం వినాయకచవితి కావడంతో జిల్లాతో పాటు నంద్యాల పట్టణంలో వినాయక మండపాలు భారీగా వెలిశాయి. వాడవాడలా ఏర్పాటైన మండపాల్లో వినాయక విగ్రహాలను భక్తులు సోమవారమే తరలించారు. తమ గృహాల్లోని పూజా మందిరాల్లో చిన్న చిన్న మట్టి ప్రతిమలతో రూపొందించిన గణపతి మూర్తులను కూడా భక్తులు విరివిగా కొనుగోలు చేస్తున్నారు. వినాయక చవితి రోజు నుంచి ఉమ్మడి జిల్లాలో కొనసాగే 'గణేశ్' ఉత్సవాల సందడి కనిపించింది. అంబరాన్ని అంటే సంబరాలతో ఆయా ప్రాంతాల్లోని ఉత్సవ కమిటీల నిర్వాహకులు విగ్రహాలను మండపాలకు తరలించారు. సోమవారం రాత్రి పొద్దు పోయే వరకు గణేశ్ ఉత్సవమూర్తులను భారీ డీజే సౌండ్స్ మధ్య తరలిస్తూ యువత సందడి చేసింది. కాగా వినాయక చవితి సందర్భంగా గృహాల్లో పూజించుకునే మట్టి గణపతి ప్రతిమలకు గిరాకీ ఏర్పడింది. తోపుడు బండ్ల వ్యాపారులు కూడా ఆకర్షణీయ రంగుల్లోని మట్టి గణేశ్ ప్రతిమలను అమ్మకాలు సాగిస్తున్నారు. విగ్రహాలు సైజును బట్టి రూ. 100 నుంచి రూ.700 వరకు ధరలు పలుకుతున్నాయి.



మార్కెట్‌లో మట్టి విగ్రహాలు

ప్రమాదం.. అయినా తప్పని జీవన పోరాటం

వరదజలాల్లో మత్స్యకారుల చేపల వేట



వరద జలాల్లో చేపల కోసం వల వేస్తున్న మత్స్యకారుడు

అవును.. వారి జీవన విధానం అందరిలా కాదు.. నిత్యం ప్రమాదకరమైన జీవనపోరాటం.. వరద ప్రవాహం ప్రాణాపాయం అని తెలిసినా... తప్పని బ(మె)తుకు పోరాటం.. పారే నీటిలో ప్రాణాలకు తెగించి శ్రమిస్తేనే ఇంటిల్లపాదీ ఆకలి తీరేది.. వెలుగోడు జలాశయం వద్ద మత్స్యకారుల వైవిధ్యమైన జీవన విధానం ఇదీ...

ఆత్మకూరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం జలాశయానికి భారీగా వరదనీరు వచ్చి చేరడంతో పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ నుంచి బనకచెర్ల క్రాస్ రెగ్యులేటర్ మీదుగా వెలుగోడు జలాశయానికి ప్రతిరోజు సుమారు 15వేల క్యూసెక్కుల వరదనీరు వచ్చిచేరుతోంది. అయితే జలాశయంలోకి వరద జలాలు ప్రవేశించే మార్గంలో మత్స్యకారులు ఉత్సాహంగా చేపల వేట సాగిస్తున్నారు. సంప్రదాయమైన వలలతో పాటు చిక్కాలను వేసి చేపలను పడుతున్నారు. వరదజలాల్లో కొట్టుకుపోయే చేపలను చిక్కాల ద్వారా పట్టుకునేందుకు మత్స్యకారులు పడుతున్న పాట్లు అన్నీఇన్నీ కావు. అక్కడే పిల్లాపాపలతో చిన్నపాటి గుడిసెలను ఏర్పాటు చేసుకుని ఉదయం నుంచి రాత్రి వరకు అక్కడే మకాం వేసి చేపల కోసం నిరీక్షిస్తుంటారు. ప్రస్తుత వరద ప్రవాహంలో ఐదు కేజీలకు మించిన పెద్దపెద్ద చేపలు పడుతున్నాయి. దీంతో మత్స్యకారులు పోటాపోటీగా చేపలు పడుతున్నారు. తాజా చేపలకు మంచి గిరాకీ ఉండటంతో చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు అక్కడికి చేరుకుని చేపలను కొనుగోలు చేస్తున్నారు. మొత్తానికి మిగతా రోజులతో పోల్చితే వరద ప్రవాహం ఉన్న రోజుల్లో చేపలు ఎక్కువగా చిక్కే అవకాశం ఉందని మత్స్యకారులు చెబుతున్నారు. అందుకే ప్రమాదమని తెలిసినా.. బతుకు పోరాటంలో భాగంగా చేపల వేటను సాగిస్తున్నారు.



వెలుగోడు జలాశయం వద్ద చేపలను కొనుగోలు చేస్తున్న దృశ్యం



వరద జలాల పక్కనే గుడిసెలో మత్స్యకారుల నివాసం

బలితీసుకుంటున్నాయ్..!

5వ పేజీ తరువాయి

కోసిగిలోని ప్రభుత్వ మోడల్ పాఠశాలకు సుమారుగా 200 మీటర్ల దూరంలో రోడ్డు పక్కనే తెల్ల గరుసు అక్రమ తవ్వకాలు సాగిస్తున్నారు. అక్రమార్కుల తవ్వకాలతో ఏర్పడిన కుంటలు వర్షపు నీటితో నిండిపోయాయి. మోడల్ స్కూల్‌లో 6-10వ తరగతి, ఇంటర్‌లో 650 మంది విద్యార్థులు చదువుతున్నారు. చిగిలి ఘటన నేపథ్యంలో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

- ఎమ్మిగనూరు మండలం కోటేకల్లు గ్రామ శివారులో ఎల్లెల్సీ కాలువకు వెళ్లే దారి పక్కనే గ్రానైట్ క్వారీ తవ్వకాలు చేశారు. భారీ కుంటలు ఏర్పడ్డాయి. క్వారీకి అనుమతులున్నా.. గ్రానైట్ అయిపోగానే ఆ కుంటలు పూడ్చకుండా అలాగే వదిలేసి వెళ్లిపోయారు. ప్రమాదకరంగా మారిన ఆ క్వారీ కుంటలు పక్క నుంచి రైతులు, ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని రాకపోకలు సాగిస్తున్నారు.
- ఆలూరు చెరువులో ఇష్టారాజ్యంగా మట్టి, గరుసు అక్రమ తవ్వకాలు వల్ల పెద్దపెద్ద కుంటలు ఏర్పడ్డాయి. వర్షపు నీటితో నిండిన ఆ కుంటలు ప్రమాదకరంగా మారాయని ప్రజలు పేర్కొంటున్నారు. అగ్రహారం కొండల్లోనూ దాదాపు ఇదే పరిస్థితి ఉంది.
- కర్నూలు-ఎమ్మిగనూరు ప్రధాన రహదారి పక్కనే గోనెగండ్లలో ఓ బావి ఉంది. ఇది ప్రమాదకరంగా మారినా పట్టించుకునేవారే లేరు. జిల్లా యంత్రాంగం అదే రహదారి వెంబడే రాకపోకలు సాగిస్తున్నా ప్రాణాంతకంగా మారిన ఆ పాడుబడిన ఆ బావి కనిపించలేదా? ఎమ్మిగనూరు మండలం కందనాతి గ్రామంలో మసీదుపురం గ్రామ క్రాస్‌లో నీటి గుంత ప్రమాదకరంగా మారింది. ఈ గుంతకు సమీపంలోనే ప్రాథమిక పాఠశాల ఉంది.
- పత్తికొండ-ఆదోని ప్రధాన రహదారి పక్కనే దేవనబండి వద్ద ఎర్రమట్టి తవ్వకాలతో భారీ కుంట ఏర్పడింది. పాఠశాలకు అర కిలోమీటరు దూరంలో ఉన్న ఆ గుంత వర్షపు నీటితో నిండిపోయింది. వాహనదారులకు కూడా ప్రమాదకరంగా ఉంది.

అధికారులు నిద్రమత్తు వీడాలి..

ఉమ్మడి జిల్లాల్లో చిగిలి లాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే అధికారులు ఇప్పటికైనా నిద్రమత్తు వీడాలి. అనుమతుల పేరిట సాగించే క్వారీలు సహా అక్రమ తవ్వకాలతో ఏర్పడిన క్వారీ గుంతలు, ప్రమాదకరంగా మారిన నీటికుంటలు గుర్తించి ఉపాధి హామీ పథకంలో భాగంగా కుంటలు పూడ్చడమే కాకుండా, రక్షణ చర్యలు చేపట్టాలి. అప్పుడే ఇలాంటి దుర్ఘటనలకు కొంతైనా చెక్ పెట్టవచ్చు.

నేత్రదానం చేయాలి: కలెక్టర్

కర్నూలు హాస్పిటల్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): నేత్రదానం చేసి అంధత్వ నివారణకు సహకరించాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా ప్రజలకు పిలుపునిచ్చారు. సోమవారం కర్నూలు కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో 40వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాలకు సంబంధించిన పోస్టరును డీఎంహెచ్‌వో డాక్టర్ పి.శాంతికళతో కలిసి కలెక్టర్ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ సెప్టెంబరు 8వ తేదీ వరకు నేత్రదాన పక్షోత్సవాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. మరణాంతరం కళ్లు నశించిపోకుండా ఇద్దరికి కార్నియా అంధులకు చూపును ప్రసాదించాలని కోరారు. మరణించిన వ్యక్తి సమాచారాన్ని 6 గంటల్లోపు సమీపంలో ఉన్న కంటి సేకరణ కేంద్రానికి ఇస్తే వైద్య సిబ్బంది వచ్చి నేత్రాలను సేకరిస్తారని తెలిపారు. నేత్రదానం కోసం నేత్ర బ్యాంక్ నెంబర్లు 9849903116, 964069229లకు సంప్రదించాలని కలెక్టర్ కోరారు. కార్యక్ర మంలో జేసీ బి.నవ్య, డీఆర్వో వెంకటనారాయణమ్మ, జిల్లా అంధత్వ నివా రణ సంస్థ కార్యదర్శి డాక్టర్ సంధ్యారెడ్డి, కర్నూలు ఆర్‌ఈహెచ్ సూపరిం టెండెంట్ డాక్టర్ పి.వెంకటేశ్వర్లు, జీజీహెచ్ అడ్మినిస్ట్రేషన్ అధికారి సింధూ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

అపోహలు వద్దు

కర్నూలు హాస్పిటల్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): నేత్రదానానికి ప్రజలు ముందుకు రావాలని, అపోహలు వద్దని కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు సూచించారు. జాతీయ పక్షోత్సవాల సందర్భంగా సోమవారం కర్నూలు జీజీహెచ్‌లో పోస్టర్‌ను ఆవిష్కరించారు. నేత్రదానంపై ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చేలా నేత్రదాతల కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ వారం రోజులు ఆసుపత్రిలోని ప్రతి వార్డులో రోగులకు, బంధువులకు, సిబ్బందికి అవగాహన కల్పించాలని ఆయన కోరారు. ప్రజలు నేత్రదానంపై అపోహలు వీడాలని సూచించారు. సీఎస్‌ఆర్‌ఎంవో డాక్టర్ వెంకటరమణ, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ శివబాల, ట్రాన్స్‌ప్లాంట్ కో-ఆర్డినేటర్లు సంపత్ కుమార్, హర్షద్ బాషా, కార్నియా రికవరీ టెక్నీషియన్లు గంగాధర్, నరేష్ పాల్గొన్నారు.

రాఘవేంద్రుడి సన్నిధిలో సీబీఐ స్పెషల్ జడ్జి



దర్శనానికి వచ్చిన సీబీఐ స్పెషల్ జడ్జి గజానన్ భట్

మంత్రాలయం, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్ర స్వామిని సీబీఐ స్పెషల్ జడ్జి గజానన్ భట్ సోమవారం దర్శించుకున్నారు. ఆదివారం రాత్రి మంత్రాలయంలో బసచేశారు. సోమవారం ఆలయ మర్యాదలతో ఏఏవో మాధవశెట్టి, మఠం మేనేజర్లు ఎస్‌కే శ్రీనివాసరావు, సురేష్ కోణాపూర్ జడ్జికి ఘనంగా స్వాగతం పలికారు. గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకొని రాఘవేంద్ర స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. జడ్జికి మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు రాఘవేంద్ర స్వామి మెమెంటో, శేషవస్త్రం, ఫలపుష్ప మంత్రాక్షితలు, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు. అనంతరం నూతనంగా నిర్మించిన పుష్కరిణి, తుంగభద్ర కారిడార్, గురునివాస్‌ను పీఠాధిపతులతో కలిసి పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. వారి వెంట మంత్రాయం సీఐ రామాంజులు, ఎస్‌ఐ- శివాంజల్, జోనల్ మేనేజర్ శ్రీపతిఆచార్, వ్యాసరాజాచార్, అనంతపురాణిక్ ఉన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించుకుందాం

- కలెక్టర్ రాజకుమారి పిలుపు
- మట్టి వినాయక విగ్రహాల పంపిణీ



మట్టి వినాయక విగ్రహాలను అందజేస్తున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల ఎడ్యుకేషన్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): పర్యావరణాన్ని పరిరక్షించుకుందామని కలెక్టర్ రాజకుమారి పిలుపునిచ్చారు. నంద్యాల కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్ వద్ద సోమవారం జిల్లా కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 2500 మట్టి విగ్రహాలను సోమవారం కలెక్టర్ ప్రజలకు పంపిణీ చేశారు. ముందుగా శాస్త్రోక్తంగా వినాయక విగ్రహాలకు పూజలు నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ సహజ రంగులతో తయారు చేసిన మట్టి వినాయకుడి విగ్రహాలను వాడి పండుగను పర్యావరణానికి అనుకూలంగా నిర్వహించుకుందామని పిలుపునిచ్చారు. చెరువులు, జలవనరులకు నష్టం కల్గించే వ్యర్థ పదార్థాల వినియోగం తగ్గించుకుందామన్నారు. అనంతరం క్లాత్ బ్యాగుతో పాటు మట్టితో తయారు చేసిన వినాయకుని విగ్రహాలను ప్రజలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీఆర్వో రామునాయక్ పాల్గొన్నారు.

డిగ్రీలో ప్రవేశానికి నేటితో ముగియనున్న రిజిస్ట్రేషన్ గడువు

కర్నూలు అర్బన్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): రాయలసీమ యూనివర్సిటీలోని క్యాంపస్ డిగ్రీ కాలేజీలో నాలుగేళ్ల ఆనర్స్ కోర్సుల్లో ప్రవేశానికి రిజిస్ట్రేషన్ గడువు మంగళవారం ముగుస్తుందని రిజిస్ట్రార్ బోయ విజయకుమార్ నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరానికి బీకాం(కంప్యూటర్ అప్లికేషన్స్), బీఎస్సీ (కంప్యూటర్ సైన్సు), బీఎస్సీ (హార్టికల్చర్) కోర్సుల్లో చేరడానికి ఇంటర్‌లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు అర్హులని తెలిపారు. ప్రతి కోర్సులో 50 సీట్ల చొప్పున అందుబాటులో ఉన్నాయని, అర్హత కలిగిన విద్యార్థులంతా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్స్ వర్తిస్తాయని, వర్సిటీ ప్రాంగణంలోనే విద్యార్థులకు హాస్టల్ వసతి కూడా ఉంటుందని తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు సర్టిఫికెట్ల కాపీలతో పాటు ఒక పాస్‌పోర్టు సైజ్ ఫొటో, రిజిస్ట్రేషన్ ఫీజ్‌తో పాటు ఐడీ, ఆధార్‌తో లింకు అయిన సెల్‌ఫోన్ నెంబర్ తీసుకువస్తే ఆయా విభాగాల్లో రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం కల్పిస్తామని తెలిపారు.

50 రోజులుగా...

- ప్రాచీన పద్ధతుల్లో మండపాల మరమ్మతులు
- మల్లన్న సన్నిధిలో అధికారుల పర్యవేక్షణ

నంద్యాల, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి అమ్మవార్ల ఆలయ ప్రాంగణంలోని పరివార (సాలు) మండపాలు, ఆలయాల్లో పైకప్పు, లీకేజీ మరమ్మతు పనులు జోరుగా సాగుతున్నాయి. గత 50 రోజులుగా ప్రాచీన పద్ధతిలో ఈ పనులు జరుగుతున్నాయి. భారతీయ ప్రాచీన నిర్మాణ పద్ధతులను అనుసరించి లైవ్ మోటర్ పద్ధతి(సునపుగార) మరమ్మతు చేయాలని ఆలయ అర్చకులు, అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఈ పనులు చేపట్టేందుకు పూణేకు చెందిన లార్డ్ వెంకటేశ్వర చారిటబుల్ అండ్ రిలీజియస్ ట్రస్ట్ సంస్థ ముందుకొచ్చింది. దీంతో రెండు నెలల కిందట ట్రస్ట్ ప్రతినిధులు ఆలయంలో పర్యటించారు. రూ.5కోట్లు ఖర్చు అవుతుందని ట్రస్టు ప్రతినిధులు అంచనాకు వచ్చారు. అనంతరం స్వచ్ఛందంగా పనులను చేపట్టారు.



శుభ్రం చేస్తున్న కార్మికులు

ప్రధానంగా శ్రీశైలంలోని కుడి, ఎడమ సాలు మండపాలు, స్వామి వారి వెనుక భాగంలో ఉన్న శివాలయం, ఉప ఆలయాలు, ఉమామహేశ్వర స్వామి మండపాలతో పాటు లడ్డుపోటు మండపం.. సహస్ర దీపారాధన మండపం, లడ్డుపోటు దేవాలయం వెనుక, వీర శిరోమండపం తదితర మండపాలు పరంగా.. 40 వేల చదరపు అడుగుల విస్తీర్ణం కలిగిన సదరు ఆలయాల్లో పనులకు శ్రీకారం చుట్టారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా 50 రోజుల నుంచి పనులు కొనసాగిస్తున్నారు. ఇప్పటికే 24 వేల చదరపు అడుగుల్లో పనులు వేగవంతంగా చేపట్టారు.



పనుల్లో నిమగ్నమైన కార్మికులు

ప్రాచీన పద్ధతిలో ఇలా... వేల సంవత్సరాల కిందట జరిగిన ప్రాచీన పద్ధతుల రూపంలో మిశ్రమాన్ని చేసి నిర్మాణాలకు వినియోగిస్తున్నారు. లైవ్ మోటర్ పద్ధతి(సున్నపు గార)లో కరక్కాయపొడి, సున్నం, ఇసుక, మారేడు, బెల్లం, కాల్చిన మట్టి, ఇటుక ముక్కలు, ఇటుకల పొడితో పాటు ఆరబ్ దేశాల నుంచి దిగుమతి చేసుకున్న బంకను వాడుతున్నారు. ఈ మిశ్రమాన్ని వేర్వేరుగా పురాతన పద్ధతిలో కొన్ని రోజుల పాటు తొట్టెల్లో నానబెట్టి మిశ్రమాన్ని సిద్ధం చేస్తారు. ఈ పద్ధతిలో జరిగే నిర్మాణాలు 200 ఏళ్ల పాటు చెక్కుచెదరవని ట్రస్టు నిర్వాహకులు చెబుతున్నారు.

నేడు నంద్యాల పార్లమెంట్ విస్తృత స్థాయి సమావేశం

- హాజరుకానున్న మంత్రులు, త్రిసభ్య కమిటీ సభ్యులు
- ఆశావహుల నుంచి దరఖాస్తులు స్వీకరణ

నంద్యాల, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): నంద్యాల పట్టణంలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో మంగళవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటలకు నంద్యాల పార్లమెంట్ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించనున్నారు. ఈ సమావేశానికి త్రిసభ్య కమిటీ సభ్యులు మాజీ మంత్రి, పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, గుంటూరు మేయర్ కోవెలమూడి నాని, ఏపీఎస్ ఆర్టీసీ కడప జోన్ చైర్మన్, పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ పూల నాగరాజుతో పాటు జిల్లాలోని మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీ సైతం హాజరుకానున్నారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షులు, పలు అనుబంధ, పార్లమెంట్ కమిటీ, తదితర వాటికి ఆశావహుల నుంచి దరఖాస్తుల స్వీకరణ జరుగుతుంది. ఈ నేపథ్యంలో నేడు నంద్యాల పట్టణంలో టీడీపీ శ్రేణులు, నాయకులతో సందడి వాతావరణం నెలకొననుంది. మరీ ముఖ్యంగా ఆశావహుల్లో ఉత్కంఠ రేపినట్లైంది.

మాదే శ్రీశైలం..!

- ఉమ్మడి కర్నూలు జిల్లావాసుల మనోగతం
- మార్కాపురంలోకి చేర్చాలంటూ ప్రచారం..!
- శ్రీశైలాన్ని కాపాడుకుంటాం : ఎమ్మెల్యే బుడ్డా



శ్రీశైల దేవస్థానం

ఆత్మకూరు, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక.. పలు కొత్త జిల్లాల ఏర్పాటుతో పాటు జిల్లాలు, నియోజకవర్గాల సరిహద్దులను మార్పు చేసేందుకు కసరత్తు చేస్తోంది. అయితే దేశంలోనే మరెక్కడా లేనివిధంగా ద్వాదశ జ్యోతిర్లింగాలు, అష్టాదశ శక్తి పీఠాలు కొలువై అత్యంత విశిష్టత కలిగిన పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న శ్రీశైలాన్ని కొత్తగా ఏర్పడే మార్కాపురం జిల్లాలోకి చేర్చాలన్న ప్రచారం తెరపైకి వస్తోంది. ఉమ్మడి కర్నూలు జిల్లాతో శ్రీశైలానికి ఆధ్యాత్మిక, చారిత్రాత్మక, భౌగోళిక అంశాలతో విడదీయరాని అనుబంధం ఉంది. అంతేకాదు.. పరిపాలనలో ఏలోటు రానివ్వకుండా శ్రీశైలం మండలాభివృద్ధికి ఇక్కడి ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ఇందులో భాగంగానే సున్నిపెంట గ్రామాన్ని కూడా పంచాయతీ హోదా కల్పించి అక్కడి ప్రజలకు మెరుగైన సదుపాయాలు కల్పిస్తున్నారు.

బ్రిటీష్ హయంలో 1808లో మద్రాస్ ప్రెసిడెన్సీ పరిధిలో రాయలసీమలోని కొంత ప్రాంతాన్ని కర్నూలు జిల్లాగా ఏర్పాటు చేశారు. అప్పట్లో శ్రీశైలాన్ని కూడా ఇదే జిల్లాలో ఉంచారు. తర్వాత 1953లో ఆంధ్రరాష్ట్రం ఏర్పాటైన సందర్భంలో కర్నూలును రాష్ట్ర రాజధానీగా ప్రకటించారు. మళ్లీ 1956లో జరిగిన రాష్ట్రాల పునర్విభజన చట్టంలో భాగంగా కర్నూలు జిల్లాలో ఉన్న బళ్లారి ప్రాంతంలో కన్నడ భాషా కలిగిన జనాభా ఎక్కువగా ఉండటంతో భాషా ప్రయుక్తంలో భాగంగా అప్పటి మైసూర్ రాష్ట్రం (ఇప్పటి కర్నాటక)లో కలిపారు. ఆ తర్వాత 1970 ఫిబ్రవరి 2వ తేదిన గుంటూరు నుంచి ఒంగోలు, కందుకూరు, చీరాల, అద్దంకి, నెల్లూరు జిల్లా నుంచి కనిగిరి, దర్శి, కర్నూలు జిల్లా నుంచి మార్కాపురం, గిద్దలూరు, ఎర్రగొండపాలెం నియోజకవర్గాలతో కలిసి ఒంగోలు జిల్లా కేంద్రంగా కొత్త జిల్లాను ఏర్పాటు చేశారు. ఆ తర్వాత 1972 డిసెంబర్ 5వ స్వాతంత్ర సమరయోధుడు టంగుటూరు ప్రకాశం పంతులు పేరిట ప్రకాశం జిల్లాగా మార్చడం జరిగింది. ప్రకాశం జిల్లా ఏర్పాటు సమయంలో కూడా శ్రీశైలం భౌగోళికంగా దగ్గరగా ఉండటంతో కర్నూలు జిల్లాలోనే ఉంచారు. ఇందులో భాగంగానే శ్రీశైలం ప్రాంతాన్ని ప్రస్తుత ఆత్మకూరు మండల పరిధిలోని వెంకటాపురం రెవెన్యూ గ్రామం పరిధిలోకి చేర్చి పరిపాలన సాగించినట్లు తెలిసింది. ఈక్రమంలోనే ప్రస్తుతం శ్రీశైలం ప్రత్యేక మండలంగా ఏర్పాటైనప్పటికీ పరిపాలన ఆత్మకూరు మండలాధికారులే చూసుకోవడం గమనార్హం. అందుకే ఆత్మకూరు నియోజకవర్గం పేరును సైతం ఏకంగా శ్రీశైలంగా మార్చారు. అయితే ప్రస్తుతం కొత్తగా ఏర్పాటయ్యే మార్కాపురం జిల్లాలో శ్రీశైలాన్ని చేర్చాలన్న కొందరి ప్రతిపాదన ప్రస్తుతం ఉమ్మడి కర్నూలు జిల్లా ప్రజల సెంటిమెంట్లను దెబ్బతీసేలా ఉందని చెప్పవచ్చు.

శ్రీశైలాన్ని కాపాడుకుంటాం

ఉమ్మడి కర్నూలు జిల్లా ప్రజల మనోభావాలతో ముడిపడి ఉన్న శ్రీశైలాన్ని కాపాడుకునేందుకు ఎలాంటి త్యాగాలకైనా సిద్ధంగా ఉండాలని శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి జిల్లా ప్రజలకు పిలుపునిచ్చారు. ద్వాదశ జ్యోతిర్లింగం, అష్టాదశ శక్తిపీఠం కలిగిన శ్రీశైలాన్ని వదులుకోమని అవసరమైతే రాజకీయాలకు అతీతంగా అడుగులు వేస్తామన్నారు.

- బుడ్డా రాజశేఖరరెడ్డి, ఎమ్మెల్యే



శ్రీశైలం ఏరియల్ వ్యూ



సున్నిపెంట గ్రామం

శ్రీశైల దేవస్థానంలో శిథిలావస్థకు చేరిన భవనాల తొలగింపునకు చర్యలు

నంద్యాల కల్చరల్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): శ్రీశైల దేవస్థానం పరిధిలోని పెద్దసత్రం, పొన్నూరు సత్రం, శివసదనం భవనాలు శిథిలావస్థకు చేరుకోవడంతో వాటి తొలగింపునకు చర్యలు చేపట్టినట్లు ఆలయ ఈవో శ్రీనివాసరావు తెలిపారు. భవనాల నిర్దిష్ట ఆయుర్దాయ కాలపరిమితి కూడా ముగింపు దశకు చేరిందన్నారు. ఈ భవనాలు ప్రస్తుతం నివాసయోగ్యం కావని రహదారులు-భవనాలు, పంచాయతీరాజ్ శాఖల సాంకేతిక నిపుణులు సైతం తెలిపారన్నారు. కావున నివాసుల భద్రత దృష్ట్యా ఈ భవనాలలోని నివాసితులందరినీ ఖాళీ చేయించి భవనాలను తొలగించాలని నిర్ణయించామన్నారు. ఈ మూడు భవనాలలోని నివాసితులందరూ ఒక నెల లోపు ఖాళీ చేయాలని లిఖితపూర్వకమైన నోటీసులు కూడా ఇస్తున్నామని ఈవో తెలిపారు.

శ్రీశైల భ్రమరాంబకు బంగారు హారాలు బహూకరణ

నంద్యాల కల్చరల్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): శ్రీశైల దేవస్థానంలోని భ్రమరాంబ అమ్మవారికి సోమవారం నెల్లూరుకు చెందిన అచ్యుత వెంకట సాయి మాధవ శశాంక్ తన కుటుంబ సభ్యులతో కలిసి మూడు బంగారు హారాలను సమర్పించారు. పగడాలు, ముత్యాలు, కెంపులు, పచ్చలతో కూడిన ఈ మూడు బంగారు హారాలు మొత్తం 232 గ్రాముల బరువు ఉన్నాయని ఆలయ అధికారులు తెలిపారు. వీటిలో ఒక హారం బరువు 78గ్రాములు, రెండో హారం 79 గ్రాములు, మూడో హారం 75 గ్రాములు ఉన్నాయన్నారు. దాతలకు అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ఆశీర్వచన మండపంలో ఈ హారాలను ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీనివాసరావుకు అందజేశారు. అనంతరం సహాయ కార్యనిర్వహణాధికారి స్వాములు, ఇన్‌స్పెక్టర్ మల్లిఖార్జున దాతలకు వేదాశీర్వచనంతో పాటు స్వామి, అమ్మవార్ల శేషవస్త్రాలు, ప్రసాదాలను అందజేశారు.

ఒరిజినల్ సర్టిఫికెట్లు కాలిపోయాయి

- ఉద్యోగం నష్టపోకుండా చూడాలి
- ఎస్జీటీ పోస్టుకు ఎంపికైన మధు ఆవేదన




దగ్ధమైన ఒరిజినల్ సర్టిఫికెట్లు, బాధితుడు మధు

అవుకు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెర్లోపల్లెలో సోమవారం ఉదయం తమ ఇంట్లో జరిగిన షార్ట్ సర్క్యూట్ వల్ల సరిఫికెట్లు కాలిపోయాయని ఆ గ్రామానికి చెందిన మధు వ్యక్తం చేశారు. ఇటీవల విడుదలైన డీఎస్సీ ఫలితాల్లో మధు ఎస్జీటీ పోస్టు సాధించారు. సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు హాజరు కావాల్సి ఉంది. అయితే ఇంతలోనే సర్టిఫికెట్లు కాలిపోయాయని బోరున విలపిస్తూ మధు రెవెన్యూ, పోలీస్, ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆర్‌ఐ వెంగళరెడ్డి, వీఆర్వో సుబ్బరాయుడు, పంచాయతీ సెక్రటరీ మధుసుధాకర్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఇటీవల విడుదలైన ఫలితాల్లో మధు 80.53 మార్కులు సాధించి జిల్లా స్థాయిలో 773 ర్యాంకును సాధించి ఎస్జీటీగా ఎంపికయ్యారు. వెరిఫికేషన్ కోసం సర్టిఫికెట్లను సిద్ధం చేసుకొని ఫ్రిజ్ పక్కన ఉంచానని, అయితే షార్ట్ సర్క్యూట్ వల్ల ఫ్రిడ్జ్ నుంచి మంటలు వ్యాపించి ధ్రువీకరణ పత్రాలు కాలిపోయాయని లబోదిబోమన్నారు. సర్టిఫికెట్లు పొందాలంటే సమయం పడుతుందని, ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు జోక్యం చేసుకొని ఉద్యోగం నష్టపోకుండా చూడాలని కోరారు.

స్నేహితులను బలితీసుకున్న రోడ్డు

- చికిత్స పొందుతూ యువకుల మృతి




మాబు సుభాన్, రాజేశ్ (ఫైల్)

ఎమ్మిగనూరు రూరల్/మంత్రాలయం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు మండలంలోని బనవాసి సమీపంలో కారు, బైకు ఢీకొన్న ఘటనలో గాయపడిన స్నేహితులు రాజేశ్(29), మాబు సుభాన్(29) చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందారు. ఎమ్మిగనూరు రూరల్ ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపిన వివరాలివీ.. మంత్రాలయానికి చెందిన రాజేశ్, మాబు సుభాన్ స్నేహితులు. మాబు సుభాన్‌కు సాఫ్ట్‌వేర్ కంపెనీలో సోమవారం ఇంటర్వ్యూ ఉండడంతో చెన్నైకి బయలుదేరడం కోసం ఆదోని రైల్వే స్టేషన్‌కు వెళ్లాడు. మాబు సుభాన్‌ను డ్రాప్ చేయడం కోసం అతడి స్నేహితుడు రాజేశ్ వచ్చాడు. అయితే ఇంటర్వ్యూ క్యాన్సిల్ అయిందని సమాచారం అందడంతో వారిద్దరూ మంత్రాలయానికి తిరుగు పయనమయ్యారు. అయితే బనవాసి సమీపంలో వీరు బైకు, కారు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో రాజేష్, మాబు సుభాన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం ఎమ్మిగనూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడి నుంచి కర్నూలుకు తరలించారు. అయితే అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందారు. రూరల్ ఎస్‌ఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మరో ఘటనలో ఒకరు..



రాఘవేంద్ర(ఫైల్)

మంత్రాలయం: మంత్రాలయానికి చెందిన నేసే రాఘవేంద్ర (24) శనివారం అమావాస్య నేపథ్యంలో ఉరుకుంద పుణ్యక్షేత్రానికి మోటారు సైకిల్‌పై బయలుదేరారు. కుప్పగల్లు దగ్గర బైకు అదుపుతప్పడంతో తీవ్రంగా గాయపడ్డారు. చికిత్స నిమిత్తం ఎమ్మిగనూరుకు తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండడంతో కర్నూలు తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాక్టర్ నుంచి పడి వృద్ధుడు..



స్వాములు(ఫైల్)

నందికొట్కూరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఏబీఎం పాలెం చెందిన కాటేపోగు స్వాములు(62) ప్రమాదవశాత్తు ట్రాక్టర్‌పై నుంచి పడి మృతి చెందారు. వివరాలివీ.. వడ్డెపేటలోని ఆంజనేయ స్వామి దేవాలయం సమీపంలో కాలువ పనులు జరుగుతున్నాయి. సిమెంట్ బస్తాలను దించేందుకు స్వాములు వెళ్లారు. అయితే ప్రమాదవశాత్తు ట్రాక్టర్‌పై నుంచి కింద పడడంతో అక్కడికక్కడే స్వాములు మృతి చెందారు. ఆయన భార్య సులోచన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సురేశ్‌బాబు తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరు..

గుర్తుతెలియని వాహనం ఢీ కొనడంతో ఉత్తరప్రదేశ్‌కు చెందిన కమల్ కుమార్(39 అక్కడిక్కడే మృతి చెందారు. కమల్ కుమార్ ఐస్‌క్రీమ్ అమ్ముకుంటూ జీవనం సాగిస్తుండేవారు. సోమవారం ఐస్‌క్రీమ్‌లు అమ్మిలు కొని ఇంటికి వెళ్తుండగా పగిడ్యాల రోడ్డులోని భైరెడ్డి నగర్ వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందారు. కమల్ కుమార్ బంధువుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సురేశ్‌బాబు తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో జైలు శిక్ష

వెల్దుర్తి, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): మద్యం తాగి బైక్ నడిపిన వ్యక్తికి కోర్టు జైలుశిక్ష విధించింది. ఎస్‌ఐ అశోక్ తెలిపిన మేరకు.. మండలంలోని బోగోలు గ్రామానికి చెందిన చిన్నగోపాల్ ఈ నెల 21న మద్యం తాగి బైక్ నడుపుతూ పోలీసులకు పట్టుబడ్డాడు. పోలీసులు కేసు నమోదు చేసి, సోమవారం డోన్ జ్యూడిషియల్ ఫస్టు క్లాసు కోర్టులో హాజరు పరచగా న్యాయాధికారి రూ.10వేల జరిమానా లేక 7 రోజుల జైలు శిక్ష విధించారు. నిందితుడు జరిమానా కట్టలేనని జైలుకు వెళ్లినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఇన్‌చార్జి జీపీగా షాబుద్దీన్



కర్నూలు లీగల్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా కోర్టు ఇన్‌చార్జి గవర్నమెంటు ప్లీడర్‌గా ఏజీపీ సయ్యద్ షాబుద్దీన్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఇంతవరకు ఈజీపీగా ఉన్న ఆనందరావు స్థానంలో సయ్యద్ షాబుద్దీన్ నియమితులయ్యారు. సయ్యద్ షాబుద్దీన్ అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా కొనసాగుతూ ఇన్‌చార్జి గవర్నమెంటు ప్లీడర్‌గా కూడా బాధ్యతలు నిర్వర్తిస్తారు. తదుపరి ఉత్తర్వులు జారీ చేసేవరకు ఈ అదనపు బాధ్యతలు నిర్వహిస్తారని ప్రభుత్వం తన ఆదేశాలలో పేర్కొంది.

మత్తుకు బానిస కావద్దు

తుగ్గలి, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిస కాకుండా చదువుకోవాలని జొన్నగిరి ఎస్‌ఐ మల్లిఖార్జున, ఏఎస్‌డబ్ల్యూవో బాబు సూచించారు. సోమవారం జొన్నగిరి సాంఘిక సంక్షేమ హాస్టల్‌లో విద్యార్థులకు మత్తుపదార్థాలు, ఈవ్‌టీజింగ్‌పై అవగాహన కల్పించారు. చిన్నతనం నుంచే చెడు అలవాట్లకు ఉండాలన్నారు.

నత్తనడకన రైల్వేస్టేషన్ పునరుద్ధరణ..!



అసంపూర్తిగా ముఖద్వారం పనులు

- కర్నూలు సిటీ స్టేషన్ పునరుద్ధరణకు రూ.42.62 కోట్లు
- 8 నెలల్లో పూర్తి చేయాలని లక్ష్యం
- రెండేళ్లు గడిచినా కానరాని పురోగతి
- పనులను పరిశీలించిన చీఫ్ జనరల్ ఇంజనీరు రెహమాన్

కర్నూలు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): కర్నూలు సిటీ రైల్వే స్టేషన్ పునరుద్ధరణ (రీ మోడలింగ్) పనులు ఎనిమిది నెలల్లో పూర్తి చేయాలని లక్ష్యం. పనుల్లో నిర్లక్ష్యం.. జాప్యం కారణంగా రెండేళ్లు పూర్తయినా పనులు కొనసాగుతూనే ఉన్నాయి. ఎప్పటికి పూర్తి చేస్తారో స్పష్టత లేదు. అమృత్ భారత్ స్టేషన్ కింద కర్నూలు సిటీ రైల్వే స్టేషన్ ఎంపిక చేశారు. రూ.42.62కోట్లతో స్టేషన్ పునరుద్ధరణ, పడమర (వెంకటరమణ కాలనీ) వైపు రెండవ ద్వారం (సెకండ్ ఎంట్రీ గేట్) నిర్మాణాల పనులు చేపట్టారు. గడువు దాటినా పూర్తికాకపోవడం, పనుల్లో జాప్యం వల్ల ప్రయాణికులు అసౌకర్యానికి గురవుతున్నారు. పనుల పురోగతిలో వేగం పెరిగేనా..? డిసెంబరు ఆఖరులోగా కర్నూలు సిటీ రైల్వే స్టేషన్ నూతన అంగులు రూపుదాల్చేనా? అంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు.

కర్నూలు సిటీ రైల్వే స్టేషన్ పునరుద్ధరణ పనుల్లో పురోగతి నత్తతో పోటీ పడుతోంది. 2019లో రూ.28 కోట్లతో స్టేషన్ రూపురేఖలు మార్చారు. స్టేషన్ ముఖ ద్వారా అధునికీకరణ, స్టేషన్‌లో పచ్చదనం, వాహనాల పార్కింగ్, ప్లాట్ ఫారం పునరుద్ధరణ, టికెట్ కౌంటర్, ప్రయాణిలకు విశ్రాంతి గదులు, స్టేషన్ ఆవరణలో భారీ జాతీయ జెండా ఏర్పాటు.. వంటి పనులు చేపట్టారు. ప్రజాదరణ కలిగిన రైల్వే స్టేషన్ల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అమృత్ భారత్ రైల్వే స్టేషన్ పథకం ఎంపిక చేసి ఆ స్టేషన్ల పునరు ద్ధరణకు శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా 2023లో రూ.42.62 కోట్లతో అదే ఏడాది ఆగస్టు 5న ప్రధాని నరేంద్ర మోదీ వర్చ్యువల్ ద్వారా శంకు స్థాపన చేశారు. 8 నెలల్లో పునరుద్ధరణ పనులు పూర్తి చేయాలని లక్ష్యం. తూర్పు వైపున ప్రధాన ద్వారం, స్టేషన్ పునరుద్ధరణతో పాటు ప్రయాణీకుల సౌకర్యం కోసం పడమర వైపు రెండవ ద్వారం (సెకండ్ ఎంట్రీ గేట్), టికెట్ కౌంటర్ నిర్మాణాలతో పాటు తూర్పు, పడమర ఎంట్రీ గేట్లను కలుపుతూ ఫుట్ ఓవర్ బ్రిడ్జీలు, రైల్వే ప్రమాణీకులు వివిధ ప్లాట్ ఫారంలో దిగేందుకు లిఫ్టులు, ఎక్స్‌కవేటర్లు ఏర్పాటు చేయాలి. అయితే.. రెండేళ్లు గడిచినా 50 శాతం కూడా పనులు పూర్తికాలేదు.

ఎన్నో ఏళ్ల స్వప్నం.. సాకారంలో జాప్యం..

పడమర వైపున వెంకటరమణ కాలనీ, అశోక్‌నగర్, లేబర్ కాలనీ, సంతోష్ నగర్, బాలజీ నగర్, కప్పలనగర్.. వంటి కాలనీలు విస్తరించాయి. ఆ దిశగా నగరం రోజురోజకు విస్తరిస్తోంది. ఆయా కాలనీల ప్రయాణికులు స్టేషన్‌కు చేరుకోవాలంటే అశోక్‌నగర్ దగ్గర రైల్వే లైన్ అండర్ బిడ్జి దిగువ నుంచి లేదంటే ఆర్టీసీ బస్టాండ్ మీదుగా ఐదు రోడ్ల కూడలి మీదుగా రావాలి. వర్షం వస్తే రైల్వే లైన్ అండర్ బిడ్జిలో వర్షపు నీరు నిండిపోయి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రైల్వేస్టేషన్ పడమర వైపు (వెంకటరమణ కాలనీ) రెండవ ద్వారం (సెకండ్ ఎంట్రీ గేట్) ఏర్పాటు చేయాలనే డిమాండ్ పాతికేళ్లుగా ఉంది. అమృత్ భారత్ రైల్వే స్టేషన్ పథకం ద్వారా స్వప్నం సాకారం అవుతుందని ఆశిస్తే, కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్ల పనుల్లో పురోగతి లేకపోవడం విమర్శలకు తావిస్తోంది.



నిలిచిపోయిన రెండో గేటు పనులు

పనులను పరిశీలించిన చీఫ్ జనరల్ ఇంజనీర్..

కర్నూలు సిటీ రైల్వే స్టేషన్ పునరుద్ధరణ, సెకండ్ ఎంట్రీ గేట్ నిర్మాణం పనులను సోమవారం దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్ చీఫ్ జనరల్ ఇంజనీరు రెహమాన్ పరిశీలించారు. పనులు నత్తనడకన సాగుతున్న తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. గడువులోగా పూర్తి చేయాలన్నారు. ప్రతిపాదనల మేరకు నిర్మాణాలు చేస్తున్నారా.. లేదా..? అంటూ పరిశీలించారు. రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట సీనియర్ సెక్షన్ ఇంజనీరు (ఎస్ఎస్ఈ) సత్యనారయణ, క్షేత్రస్థాయి పర్యవేక్షణ ఇంజనీర్లు ఉన్నారు. దీనిపై మహబూబ్ నగర్ ఎస్ఎస్ఈ సత్యనారయణ దృష్టికి ఆంధ్రజ్యోతి తీసుకెళ్లగా ఈ ఏడాది డిసెంబరు ఆఖరు వరకు గడువు పొగడిం చామని తెలిపారు. ఆలోగా పనులు పూర్తి చేసి కర్నూలు రైల్వే స్టేషన్ రూపురేఖలు మార్చేస్తామని తెలిపారు.

సర్టిఫికెట్ల పరిశీలన పారదర్శకంగా చేపట్టాలి

- కలెక్టర్ పి.రంజిత్ బాషా



వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్

ఓర్వకల్లు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా 2025 మెగా డీఎస్సీకి ఎంపికైన ఉపాధ్యాయ అభ్యర్థుల ఒరిజినల్ సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియను పారదర్శకంగా చేపట్టాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. సోమవారం మండల పరిధిలోని టోల్‌ప్లాజా సమీపంలో ఉన్న శ్రీనివాస బీ.ఎడ్, రాఘవేంద్ర బీ.ఎడ్ కళాశాలల్లో డీఎస్సీ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలనకు సంబంధించిన ఏర్పాట్లను కలెక్టర్ పరిశీలించారు. డీఎస్సీ వెరిఫికేషన్ కేంద్రాలకు ధ్రువపత్రాల పరిశీలన కోసం హాజరయ్యే అభ్యర్థులకు ఏ చిన్న సమస్య రాకుండా చూసుకోవాలన్నారు. ఇంటర్నెట్, విద్యుత్ సదుపాయాలకు అంతరాయం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఉపాధ్యాయ నియామక ప్రక్రియలో భాగంగా సర్టిఫికెట్ల ధ్రువీకరణ కీలకమైనదని, క్షుణ్ణంగా పరిశీలించాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. సబ్జెక్టు వారీగా ఏర్పాటు చేసిన గదులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఉమ్మడి జిల్లాల్లో ఎంత మంది అభ్యర్థులు హాజరుకానున్నారని అధికా రులను అడిగి తెలుసుకున్నారు. ధ్రువీకరణ పత్రాల పరిశీలనలో వచ్చే ఇబ్బందులు, వాటిని ఎలా అధిగమించాలనే విషయాలపై కలెక్టర్ విద్యాశాఖ అధికారులకు సూచనలు చేశారు. జిల్లా స్థాయిలో జరుగుతున్న సర్టిఫికెట్ల వెరిఫికేషన్ విజయవంతంగా పూర్తయ్యేలా ప్రతిఒక్కరూ బాధ్యతతో వ్యవహరించాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా 2,600 మంది అభ్యర్థులు ఎంపికయ్యారని, ధ్రువపత్రాల పరిశీలన నిమిత్తం 54 బృందాలతో పాటు అదనంగా మరికొన్ని బృందాలను ఏర్పాటు చేసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి కలెక్టర్‌కు వివరించారు. వెరిఫికేషన్‌కు ఏ క్షణాన ఆదేశాలు అందినా వెంటనే నిర్వహించడానికి సిద్ధంగా ఉన్నామని డీఈవో తెలిపారు. ఈ కార్యక్రమంలో కర్నూలు, నంద్యాల డీఈవోలు శామ్యూల్ పాల్, జనార్ధన్‌రెడ్డి, డీఎస్సీ ధ్రువపత్రాల పరిశీలన సిబ్బంది పాల్గొన్నారు.

సివిల్ కానిస్టేబుల్ అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాల పరిశీలన

కర్నూలు క్రైమ్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): సివిల్ కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థుల నియామక ప్రక్రియలో భాగంగా నగరంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ధ్రువీకరణ పత్రాల పరిశీలన జరిగింది. ఈ పరిశీలనకు మొత్తం 309 మంది సివిల్ కానిస్టేబుల్ అభ్యర్థులకు గాను 297 మంది హాజరయ్యారు. అభ్యర్థుల విద్యార్హత, కుల ధ్రువీకరణ పత్రం, స్థానికత సర్టిఫికెట్‌లను క్షుణ్ణంగా పరిశీలించి, అభ్యర్థుల వద్ద నుంచి 3 సెట్ల అటెస్టేషన్ పత్రాలను తీసుకున్నారు. ఎస్పీ విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ అభ్యర్థులు సమర్పించిన ధ్రువీకరణ పత్రాలన్నింటినీ సమగ్రంగా పరిశీలిస్తున్నారన్నారు. పత్రాల పరిశీలన అనంతరం అర్హత కలిగిన అభ్యర్థులను తదుపరి నియామక దశకు ఎంపిక చేస్తారని తెలిపారు. మంగళవారం 334 మంది ఏపీఎస్పీ కానిస్టేబుల్ అభ్యర్థులకు ధ్రువీకరణ పత్రాల పరిశీలన ఉంటుందని ఆయన తెలిపారు. సివిల్ కానిస్టేబుళ్ల ధ్రువీకరణ పత్రాల పరిశీలనకు ఈరోజు హాజరు కాని మిగిలిన 12 మంది అభ్యర్థులకు, ఏపీఎస్పీ అభ్యర్థులతో పాటు మంగళవారం మాత్రమే అవకాశం కల్పిస్తామని ఆయన తెలిపారు. ఈ ధ్రువీకరణ పత్రాల పరిశీలన కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీలు హుస్సేన్ పీరా, కృష్ణ మోహన్‌లు, ఏఆర్ డీఎస్పీ భాస్కర్‌రావు, డీపీవో ఏవో ఎస్.విజయలక్ష్మి, ఆర్‌ఐలు, సూపరింటెండెంట్లు, డీపీవో సిబ్బంది పాల్గొన్నారు.

600 బస్తాల యూరియా విక్రయాలు నిలుపుదల

- ఉరుకుందా డిపోకు షోకాజ్ నోటీసు
- కోడుమూరులో జేడీఏ వరలక్ష్మి ఆకస్మిక తనిఖీలు



రికార్డులను తనిఖీ చేస్తున్న వరలక్ష్మి

కోడుమూరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి సోమవారం కోడుమూరు పట్టణంలోని ఎరువుల దుకాణాలపై ఆకస్మిక తనిఖీ చేపట్టారు. పట్టణంలోని ఉరుకుంద రైతు డిపోలో ఆమె దాడులు నిర్వహించారు. యూరియా స్టాక్‌కు, ఈ పాస్ మిషన్‌లో విక్రయాలకు పెద్ద ఎత్తున తేడా ఉండటంతో డిపో యాజమానిని ప్రశ్నించారు. స్టాక్ బోర్డులో ఎందుకు ధరలు పొందుపరచలేదని నిలదీశారు. ఇందుకు సరైన సమాధానం లేకపోవడం ప్రస్తుతం డిపోలో ఉన్న 600 బస్తాల యూరియా, అలాగే మరో 70 బస్తాల డీఏపీ విక్రయాలను నిలిపేశారు. అలాగే షోకాజ్ నోటీస్ కూడా ఇచ్చారు. మూడు రోజుల్లో వివరణ ఇవ్వాలని, లేకపోతే తగు చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు. ఈ దాడుల్లో కోడుమూరు మండల వ్యవసాయ అధికారి రవిప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

వేరుశనగ కొనుగోలు బహిష్కరణ



వేరుశనగ వ్యాపారులతో చర్చిస్తున్న వన్‌టౌన్ సీఐ, తహసీల్దార్, కార్యదర్శి

- సాయంత్రం 6 వరకు టెండర్లు దాఖలు చేయకుండా వ్యాపారుల దోబూచులాట
- గ్రేడింగ్ కొనసాగించాలంటూ వ్యాపారులు
- రైతులకు నష్టం కలిగించే విధానంపై ఉపేక్షించబోమన్న కార్యదర్శి
- మార్కెట్ కమిటీపైకి దూసుకొచ్చిన రైతులు
- మార్కెట్ కమిటీకి రెండు రోజులు సెలవు

ఆదోని అగ్రికల్చర్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ మార్కెట్ యార్డుకు విక్రయానికి వచ్చిన వేరుశనగ దిగుబడులను కొనుగోలు చేయకుండా సోమవారం వ్యాపారులు మొండికేశారు. పదివేల బస్తాలకు పైగా విక్రయానికి తీసుకొచ్చారు. రైతులు వేరుశనగ దిగుబడులను కమిషన్ ఏజెంట్ల దుకాణాల ముందు రాశులుగా టెండర్లకు ఉంచారు. 25వ తేదీ నుంచి వ్యాపారులు మహిళా కూలీలతో పాసింగ్ చేస్తే ఉపేక్షించమని మార్కెట్ యార్డు అధికారులు ముందుగానే హెచ్చరించారు. ఉదయం 11 గంటలకు రాశులుగా పోసిన వేరుశనగ పాసింగ్ లేకుండానే టెండర్లను కోట్ చేసుకుంటూ వెళ్లారు. వేరుశనగ వ్యాపారుల సంఘం నాయకులు కొంతమంది టెండర్ వేస్తున్న వ్యాపారులను వేయకుండా ఫోన్ ద్వారా హెచ్చరించారు. వ్యాపారులు టెండర్ వేస్తున్నారని అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. టెండర్లో పాల్గొన్న వ్యాపారులంతా మార్కెట్ కమిటీ టెండర్ హాలులో ఆన్‌లైన్‌లో బిడ్ దాఖలు చేయకుండా టెండర్ ఫారాలను వారి జాబిలో పెట్టుకొని ఇంటికి వెళ్లిపోయారు. నాలుగు గంటల వరకు వారు కంప్యూటర్ రూమ్‌లకు రాకపోవడంతో అధికారులు వెంటనే అప్రమత్తమై వేరుశనగ వ్యాపారులతో మాట్లాడారు. పాసింగ్ విధానం ఉంటేనే తాము టెండర్ దాఖలు చేస్తామని, లేకపోతే చేయలేమంటూ తెగేసి చెప్పారు. రైతులకు నష్టం కలిగించే ఈ విధానంపై ఉపేక్షించమని వ్యాపారులను మార్కెట్ యార్డ్ కార్యదర్శి హెచ్చరించారు. సాయంత్రం కావస్తుండడంతో రైతులు ఒక్కసారిగా కమిషన్ ఏజెంట్లపై కొనుగోలు చేస్తారా లేదా అంటూ ఒత్తిడి పెంచారు. వారు మార్కెట్ కమిటీపై ఒక్కసారిగా దూసుకొచ్చారు. పోలీసులు అక్కడికి చేరుకొని వ్యాపారులతో చర్చిస్తున్నామని, మీ వేరుశనగ దిగుబడి వద్దకు వెళ్లాలని సూచించారు. ఈ విషయం సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ దృష్టికి మార్కెట్ యార్డ్ కార్యదర్శి కల్పన, సహాయ కార్యదర్శి శాంతకుమార్ తీసుకెళ్లారు. కార్యాలయానికి రావాలని ఆయన తెలపడంతో హుటాహుటిన కమిషన్ ఏజెంట్లు, అధికారులు పరుగులు పెట్టారు.

సబ్ కలెక్టర్ వెంటనే వన్‌టౌన్ సీఐ శ్రీరామును, తహసీల్దార్ రమేష్‌ను మార్కెట్ కమిటీకి వెళ్లి వ్యాపారులతో మాట్లాడి టెండర్లు జరిపే విధంగా చూడాలని సూచించారు. ఎంతసేపటికీ వారు ఒప్పుకోకపోవడంతో ఇలాగే కొనసాగితే లైసెన్స్ రద్దు చేస్తామని, రైతులకు ఇబ్బంది కలిగించకుండా వెంటనే టెండర్లు వేయాలని కోరడంలో ఈ ఒక్క రోజే తాము టెండర్లు వేసి కొనుగోలు చేస్తామని అంగీకరించడంతో సమస్య సద్దుమణిగింది. సాయంత్రం ఏడు గంటల వరకు టెండర్లు వేయడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. రెండు రోజులపాటు మార్కెట్ కమిటీకి వేరుశనగ దిగుబళ్లను విక్రయానికి తీసుకురావద్దని మార్కెట్ కమిటీ కార్యదర్శి కల్పన తెలిపారు. రైతులకు నష్టం కలిగించే పాసింగ్ విధానాన్ని ఉపేక్షించమని, లేనిపక్షంలో చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పింఛన్లపై ఆందోళన వద్దు

- అర్హులు అప్పీల్ చేసుకునే అవకాశం : కలెక్టర్ రాజకుమారి



నంద్యాల హాస్పిటల్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): దివ్యాంగులు పింఛన్ విషయంలో ఆందోళన వద్దని కలెక్టర్ రాజకుమారి అన్నారు. ఈ ఏడాది జనవరి నుంచి పింఛన్లు పొందుతున్న దివ్యాంగులు అందరూ ప్రభుత్వం నుంచి నోటీసులు ఇచ్చి డాక్టర్ల ఆధ్వర్యంలో రీ అసెస్‌మెంట్ ద్వారా దాదాపు జీజీహెచ్‌లో రీ వెరిఫికేషన్ పూర్తి చేశామన్నారు. రీ వెరిఫికేషన్‌లో 40శాతం కంటే ఎక్కువ దివ్యాంగత్వం ఉన్నవారికి యథావిధిగా పింఛన్ పునరుద్ధరించామన్నారు. దివ్యాంగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. 40 శాతం కంటే తక్కువ దివ్యాంగత్వం ఉండి వయసు 60ఏళ్లు దాటిన దివ్యాంగులకు వృద్ధాప్య పింఛన్‌గా మార్పుచేసి కొనసాగిస్తామన్నారు. అర్హత ఉన్నప్పటికీ 40శాతం కంటే తక్కువ దివ్యాంగత్వం ఉన్నట్లు నోటీసులు అందుకున్న వారు మండల అభివృద్ధి అధికారి ఆధ్వర్యంలో అప్పీల్ చేసుకోవడానికి అవకాశం కల్పించామన్నారు. హెల్త్ పింఛన్లకు సంబంధించి ప్రభుత్వ వైద్యులు ఇంటింటికి వెళ్లి లబ్దిదారులను రీ వెరిఫికేషన్ చేశారన్నారు. నిజమైన దివ్యాంగులకు పింఛన్ పోతుందనే భయం వద్దని, కచ్చితంగా దివ్యాంగుల పింఛన్ అందేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ఆర్టీసీ బస్టాండ్‌లో ఆర్వో ప్లాంట్‌కు భూమిపూజ


భూమిపూజ చేస్తున్న రీజనల్ మేనేజర్ రజియాసుల్తానా

నంద్యాల ఎడ్యుకేషన్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): నంద్యాల ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికుల సౌకర్యార్థం ఎమ్పీ నిధుల కింద మంజూరైన ఆర్వో ప్లాంట్‌కు ఆర్టీసీ రీజనల్ మేనేజర్ రజియాసుల్తానా భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. ఆర్టీసీ బస్టాండ్‌లో నీటి కొరతపై స్పందించిన ఎంపీ బైరెడ్డి శబరి ఆర్వో ప్లాంట్ నిర్మాణానికి తమ నిధుల నుంచి మంజూరు చేశారు. రీజనల్ మేనేజర్ మాట్లాడుతూ ఎంపీ దృష్టికి తీసుకెళ్లినా వెంటనే స్పందించి ఆర్వో ప్లాంటును మంజూరు చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ప్లాంట్ వల్ల ప్రయాణికులతో ఆర్టీసీ ఉద్యోగులకు ఎంతో మేలు చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో సెంట్రల్ ఫుడ్ కార్పొరేషన్ డైరెక్టర్ విశ్వనాధరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సురేష్, టీడీపీ నాయకులు అజయ్, మనోజ్, పుల్లారెడ్డి పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి



కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

నంద్యాల ఎడ్యుకేషన్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో విద్యారంగ సమస్యల పరిష్కారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఎస్ఎఫ్ఐ నాయకులు ఎంఆర్ నాయక్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో అనేక వసతి గృహాలకు నేటికి సొంత భవనాలు లేక అద్దె భవనాల్లో ఉంటున్నారని, వెంటనే నూతన బిల్డింగ్‌లను నిర్మించాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని, జీవోనం.77ను రద్దు చేయాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా విద్యార్థులకు మెస్ ఛార్జీలు పెంచాలని, రాష్ట్రంలో విద్యార్థులందరికీ ఉచిత బస్సుపాల్ కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు దినేష్, సుజాత, హరివర్ధన్, ఆయేషా, లతీఫ్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయాధికారిపై చర్యలు తీసుకోవాలి

పాములపాడు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): పాములపాడు వ్యవసాయాధికారిపై చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్ సుభద్రమ్మకు మండల రైతులు వినతిపత్రం అందజేశారు. రైతులు మాట్లాడుతూ మండలంలో దుకాణదారులు యూరియా బస్తా ధర 267 రూ. అమ్మాల్సి ఉండగా రూ. 650 విక్రయిస్తున్నారన్నారు. ఈ విషయాన్ని వ్యవసాయాధికారికి చెప్పి నా పట్టించుకోవడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. కార్యక్రమంలో రైతులు ఎల్లయ్య, బాలస్వామి, రామక్రిష్ణారెడ్డి, బూషణం, శివ, నాగస్వామి బాబు, రాము పాల్గొన్నారు.

'బస్ షెల్టర్‌ను తొలగించాలి'


రాస్తారోకో చేస్తున్న విద్యార్థినులు

నంద్యాల ఎడ్యుకేషన్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): నంద్యాల పట్టణం కర్నూలు బైపాస్‌రోడ్ సమీపంలోని హోలీక్రాస్ బాలికల ఉన్నత పాఠశాల ప్రధాన ద్వారం వద్ద నిర్మిస్తున్న బస్ షెల్టర్‌ను తొలగించాలని పాఠశాల విద్యార్థినులు రాస్తారోకో చేపట్టారు. పాఠశాల ప్రధాన ద్వారం వద్ద బస్ షెల్టర్ నిర్మాణం వల్ల బాలికలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందని, వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. ట్రాఫిక్ పోలీసులు అక్కడికి చేరుకుని మున్సిపల్ కమిషనర్‌తో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని హామినివ్వడంతో విద్యార్థినులు రాస్తారోకో విరమించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు మంజరీవుడ్, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

పింఛన్లను తొలగించడం దుర్మార్గం

నంద్యాల రూరల్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : విచారణ పేరుతో అర్హులైన వృద్ధులు, వికలాంగుల పింఛన్లు తొలగించడం దుర్మార్గమని సీపీఎం పట్టణ కార్యదర్శి లక్ష్మణ్ పేర్కొన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ వృద్ధులకు, వికలాంగులకు పింఛన్లు పెంచుతామని అధికారంలోకి వచ్చిన తర్వాత తొలగించడం ఏమిటని ప్రశ్నించారు. అర్హులైన వారి పింఛన్లు పునరుద్ధరించే వరకు పోరాటాలు చేస్తామని హెచ్చరించారు.

జూపాడుబంగ్లా ఎస్ఐగా మల్లికార్జున


బాధ్యతలు చేపట్టిన ఎస్ఐ మల్లికార్జున

జూపాడుబంగ్లా, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): జూపాడుబంగ్లా ఎస్ఐగా పనిచేస్తున్న లక్ష్మీనారాయణ నంద్యాల డీటీసీ (డిస్ట్రిక్ ట్రైనింగ్ సెంటర్)కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో సోమవారం వీఆర్‌లో ఉన్న మల్లికార్జున పదవీ బాధ్యతలు చేపట్టారు. మండలంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

నూతన చైర్మన్లకు సన్మానం


సంతజూటూరు చైర్మన్ కొడుదుల సాయిబాబారెడ్డిని సత్కరిస్తున్న యూనిట్ ఇన్‌చార్జి బుగ్గరాముడు

బండిఆత్మకూరు ఆగస్టు25(ఆంధ్రజ్యోతి): మండలంలోని సంతజూటూరు సొసైటీ చైర్మన్ కొడుదుల సాయిబాబారెడ్డి, ఏ కోడూరు సొసైటీ చైర్మెన్ సుబ్బారెడ్డిలను మండల టీడీపీ యూనిట్ ఇన్‌చార్జి తాటికొండ బుగ్గరాముడు సన్మానించారు. సోమవారం వారి ప్రమాణ స్వీకార అనంతరం వారితో పాటు నలుగు కమిటీ సభ్యులను సైతం పలు గ్రామాల టీడీపీ నాయకులు, సొసైటీల సీఈవోలు గోపాల్, శ్రీనివాసులు, సిబ్బంది సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డికి పాలక మండలి సభ్యులంతా కృతజ్ఞతలు తెలిపారు.

కష్టపడే వారికే పార్టీలో సముచిత స్థానం

- జెండా మోసిన కార్యకర్తలను ఎప్పటికీ మరువము
- సూపర్ సిక్స్ పథకాలు.. సూపర్ హిట్‌గా నిలిచాయి
- ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి


మాట్లాడుతున్న శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి


చంద్రబాబు చిత్రపటానికి ధాన్యాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే, నాయకులు

ఆత్మకూరు, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): టీడీపీలో కష్టపడి పని చేసే వారికే పార్టీలో సముచిత స్థానం ఉంటుందని ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి స్పష్టం చేశారు. సోమవారం స్థానిక మార్కెట్ యార్డు ప్రాంగణంలో ఆత్మకూరు మార్కెట్ యార్డు పాలక వర్గంతో పాటు పలు వ్యవసాయ సహకార పరపతి సంఘాలకు చెందిన పాలక వర్గాలు ప్రమాణ స్వీకారం చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ శ్రీశైలం నియోజకవర్గంలో ఏడాదిలోనే రూ.150కోట్లతో అభివృద్ధి పనులను చేపట్టామన్నారు. ఇవేకాకుండా సూపర్ సిక్స్ పథకాల ద్వారా తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, పింఛన్ల పెంపు, మెగా డీఎస్సీ, ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత గ్యాస్ సిలిండర్లను అందించామన్నారు. అయినప్పటికి వైసీపీ నాయకులు దిక్కుమాలిన విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందని అన్నారు. సీనియారిటీని పరిగణలోకి తీసుకొని ప్రస్తుతం కొందరికే పదవులు దక్కాయని భవిష్యత్‌లో మరికొంత మందికి అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. కొత్త జిల్లాల ఏర్పాటు, నియోజకవర్గాల సరిహద్దుల ఎంపికలో భాగంగా శ్రీశైలాన్ని మార్కాపురం జిల్లాలోకి చేర్చాలన్న ప్రచారం జరుగుతోందని, ఈ పరిస్థితుల్లో జిల్లా ప్రజలందరు రాజకీయాలకు అతీతంగా అభ్యంతరం వ్యక్తం చేయాలని పిలుపునిచ్చారు. అవసరమైతే శ్రీశైలాన్ని కాపాడేందుకు ఎలాంటి త్యాగాలకైనా వెనకాడేది లేదని స్పష్టం చేశారు. ఇందులో భాగంగానే నియోజకవర్గంలోని అన్ని గ్రామాల నుంచి తీర్మానాలను తయారు చేసి మంత్రి వర్గ ఉప సంఘానికి అందజేయాలని సూచించారు. అంతకుముందు రైతు సంబరాలను పురస్కరించుకుని స్థానిక నంద్యాల టర్నింగ్ నుంచి కేజీరోడ్డు మీదుగా మార్కెట్ యార్డు వరకు ట్రాక్టర్స్ ర్యాలీ నిర్వహించారు. అక్కడ దివంగత ఎన్టీఆర్, బుడ్డా వెంగళరెడ్డి చిత్రపటాలకు నివాళి అర్పించారు. అలాగే సీఎం చంద్రబాబు చిత్రపటానికి ధాన్యాభిషేకం గావించారు. కార్యక్రమంలో బీజేపీ, జనసేన పార్టీల ఇన్‌చార్జి మోమిన్ షబాన, రౌతు అశోక్‌కుమార్, శ్రీశైలం ట్రస్టు బోర్డు మాజీ చైర్మన్ వంగాల శివరామిరెడ్డి, తెలుగుగంగ ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ రామలింగారెడ్డి ఉన్నారు.

ఆత్మకూరు మార్కెట్ యార్డు నూతన కమిటీ సభ్యులు వీరే :

ఆత్మకూరు మార్కెట్ యార్డు కమిటీ గౌరవాధ్యక్షులుగా శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి, చైర్మన్‌గా వెలుగోడు మండలంలోని రేగడగూడూరుకు చెందిన టీడీపీ నాయకులు వంగాల వెంకటకృష్ణారెడ్డితో పాటు వైస్ చైర్మన్‌గా ఆత్మకూరు పట్టణానికి చెందిన నజీర్‌అహ్మద్‌లు ఉన్నారు. అదేక్రమంలో సభ్యులుగా టీడీపీ నుంచి కాటం రామిరెడ్డి, నర్ల రవీంద్రమ్మ, మారెడ్డి కుమారీ, బోయ పరమేష్, దూదేకుల లక్ష్మీదేవీ, భోగ్యం లాలమ్మ, గుండెపల్లి ఆర్మోజ్, ఆర్తి పెద్దన్న, పిట్టం రామకృష్ణారెడ్డి, నిర్మల, జనసేన నుంచి చింతకుంట శేషమ్మ, వీరభద్రుడు, బీజేపీ నుంచి చిట్యాల పద్మావతిలు ప్రమాణ స్వీకారం చేశారు. వీరితో పాటు ఆత్మకూరు సింగిల్ విండో చైర్మన్, వ్యవసాయశాఖ ఏడీ, మున్సిపల్ చైర్మన్, అగ్రిట్రేడ్ అండ్ మార్కెటింగ్ ఆఫీసర్ నంద్యాల వారిని సభ్యులుగా వ్యవహరించనున్నారు.

సింగిల్ విండో సొసైటీ కమిటీలు ఇవే :

శ్రీశైలం నియోజకవర్గం పరిధిలోని 7 సింగిల్ విండో సొసైటీ కమిటీలు సోమవారం ప్రమాణ స్వీకారం చేశాయి. ఇందులో ఆత్మకూరు (చైర్మన్‌గా షహబుద్దిన్, సభ్యులుగా ప్రవీణ్‌కుమార్, రమేష్), వెలుగోడు (చైర్మన్‌గా మండ్ల శివశంకరరెడ్డి, సభ్యులుగా తోక శ్రీనివాసులుగౌడ్, పోతుల రాజశేఖరరెడ్డి), రేగడగూడూరు ('చైర్మన్‌గా బషీర్ అహ్మద్, సభ్యులుగా దామోదరరెడ్డి, డేరంగుల నారాయణమ్మ), పరమటూరు (చైర్మన్‌గా సాయిబాబారెడ్డి, సభ్యులుగా సుబ్బలక్ష్మయ్య, ఇస్మాయిల్ హుసేన్), ఏకోడూరు (చైర్మన్‌గా వైవీ.సుబ్బారెడ్డి, నాగేశ్వరరావు, లక్ష్మిరెడ్డి), తిమ్మాపురం (చైర్మన్‌గా వెంకటరంగయ్య, సభ్యులు రాంపుల్లయ్య, ఈశ్వరయ్య), గోపవరం (చైర్మన్‌గా ఉమామహేశ్వరరెడ్డి, సభ్యులుగా లక్ష్మిరెడ్డి, సుబ్బయ్య) తమ బాధ్యతలను స్వీకరించారు.

వైద్యులు అందుబాటులో ఉండాలి

- ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాలను పెంచాలి
- డాక్టర్లకు సూచించిన ఎమ్మెల్యే గిత్తా జయసూర్య


ఎక్సరే పరికరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గిత్తా జయసూర్య

నందికొట్కూరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): వైద్యులు ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించాలని ఎమ్మెల్యే గిత్తా జయసూర్య సూచించారు. సోమవారం పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలలో ఎక్స్‌రే పరికరాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు, కిందపడి కాళ్లు చేతులు విరిగిన వారికి ఎక్స్‌రే లేకపోవడంతో చాలా ఇబ్బందులు పడేవారన్నారు. ఈ సమస్యలను గుర్తించి ప్రభుత్వ ఆసుపత్రిలో ఎక్స్‌రే పరికరాన్ని ఉపయోగంలోకి తెచ్చామన్నారు. ఆసుపత్రికి ప్రస్తుతం రోజుకు 300 ఓపీ ఉందన్నారు. ప్రస్తుతం 30 పడకలు ఉన్న ఆసుపత్రిని 100 పడకల ఆసుపత్రిగా మార్చేందుకు సీఎం చంద్రబాబు నాయుడు సుముఖత వ్యక్తం చేశారని, అందుకుగాను ప్రసవాలను పెంచాలన్నారు. గైనకాలజిస్టు, నర్సులు, సిబ్బంది నిత్యం అందుబాటులో ఉండాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు యాదవ్, నందికొట్కూరు మార్కెట్ యార్డు డైరెక్టర్ మాండ్ర సురేంద్రనాథ్‌రెడ్డి, సహకార సొసైటీ చైర్మన్ ముర్తుజావళి, టీడీపీ నాయకులు షకీల్ అహ్మద్, జమీల్, ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్తకు నివాళి

జూపాడుబంగ్లా : మండలంలోని తాటిపాడు గ్రామంలో టీడీపీ కార్యకర్త శ్రీనివాసగౌడు మృతిచెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే జయసూర్య గ్రామానికి చేరుకొని భౌతికకాయానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. మాజీ సర్పంచులు లక్ష్మన్నగౌడు, శ్రీనివాసగౌడు, టీడీపీ నాయకులు కృష్ణారెడ్డి, సోమశేఖర్‌గౌడు, ఖాజీకురైషన్ మన్సూర్ తదితరులు పాల్గొన్నారు.

'మట్టి వినాయకుడిని పూజిద్దాం'

నంద్యాల కల్చరల్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): మట్టి వినాయకులను పూజించి పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధత మనందరిపై ఉందని నంద్యాల ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ మల్లికార్జునగుప్తా అన్నారు. సోమవారం వెంకటాచలం కాలనీలో వాసవీజాగృతి ఇంటర్నేషనల్ క్లబ్ తరుపున ఉమ్మడి జిల్లాల చార్టర్ గవర్నర్, నంద్యాల జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు బింగుమళ్ల శ్యామ్‌సుందర్ గుప్తా ఆధ్వర్యంలో మట్టి వినాయకులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ మల్లికార్జున గుప్తా, ఆర్యవైశ్య సంఘం గౌరవ అధ్యక్షుడు ఖండే శ్యామ్‌సుందర్‌లాల్, నవనందిక్లబ్ అధ్యక్షుడు కురాకు శ్రీనివాస దత్తాత్రేయలు ఆర్యవైశ్యసంఘం సభ్యులు పాల్గొన్నారు.

- నంద్యాల గాంధీచౌక్ లో భవనాశి జ్యూవెలర్స్ వద్ద భవనాశి వెంకటసుబ్బయ్య, వెంకమ్మ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో మట్టివినాయకులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నంద్యాల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు, జనసేన నాయకులు భవనాశి శ్రీనివాస, నంద్యాల జిల్లా ఆర్యవైశ్య సంఘం గౌరవఅధ్యక్షుడు భవనాశి నాగమహేష్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లి: మండలంలోని ఆయా గ్రామాల్లో వినాయక విగ్రహాల ఏర్పాటుకు పోలీసుల అనుమతి తప్పనిసరి అని కొత్తపల్లి ఎస్ఐ జయశేఖర్ తెలిపారు. ఈ నెల 27 నుండి 29 వరకు మూడు రోజుల పాటు మాత్రమే విగ్ర హాల ఏర్పాటుకు అనుమతి ఇచ్చినట్లు తెలిపారు.

- నంద్యాల సంజీవనగర్ కోదండ రామాలయంలో అరటిపళ్లతో మహాగణపతిని 16 అడుగుల ఎత్తులో ఏర్పాటు చేస్తున్నారు. సోమవారం బ్రోచర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు దేవరశెట్టి శ్రీనివాస్, భగవత్ సేవాసమాజ్ కమిటీ అధ్యక్షుడు సముద్రాల సూరయ్య, పార్థసారధిక్రిష్ణ, దేవరశెట్టి శ్రీనివాస్ పాల్గొన్నారు.
- బాలాజీ కాంప్లెక్స్ కళ్యాణమండపంలో మహాగణపతిని ఏర్పాటు చేస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. సప్తగవ్వలను రామేశ్వరం నుంచి తెప్పించి ప్రత్యేక అలంకరణలో ఏర్పాటుచేస్తున్నట్లు తెలిపారు. సోమవారం వినాయక ఉత్సవాల కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం మట్టి వినాయకుల విగ్రహాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అర్చకులు నిఖిలేష్ శర్మ, నిర్వాహకులు కశెట్టి కృష్ణమూర్తి, ప్రదాన కార్యదర్శి నారాయణ రవికుమార్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విద్యుత్ వైర్లతో జాగ్రత్త

మండపాలకు భారీ విగ్రహాలను తరలించే సమయంలో విద్యుత్ తీగెలు, విద్యుత్‌వైర్లు కిందికి ఉన్నప్పుడు జాగ్రత్తలు పాటించాలని విద్యుత్ శాఖ ఈఈ శ్రీనివాసులు రెడ్డి నిర్వాహకులకు సూచించారు. ఏవైనా సమస్యలు ఉంటే విద్యుత్ అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఎవరు కూడా అనధికారికంగా మండపాల వద్ద విద్యుత్ వాడ కూడదన్నారు. సంబంధిత లైన్‌మెన్ ద్వారానే విద్యుత్ కనెక్షన్లు తీసుకోవాలని నిర్వాహకులకు సూచించారు.

బండిఆత్మకూరు: గ్రామాల్లో గణేశ్ ఉత్సవాలను నిర్వాహకులు ప్రశాంతంగా జరుపుకోవాలని తహసీల్దార్ పద్మావతమ్మ, ఎస్ఐ జగన్మోహన్ సూచించారు. సోమవారం వారు మాట్లాడుతూ ప్రతి మండపానికి అనుమతి పొందాలని, మంటపం వద్ద ప్రతి రోజు నిర్వాహకులు కాపలా ఉండాలని, డీజేలు ఉపయోగించరాదన్నారు. సమావేశంలో ఎంపీడీవో రామకృష్ణవేణి పాల్గొన్నారు.

బార్లకు నేటితో గడువు పూర్తి

నంద్యాల, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నూతన మద్యం పాలసీతో బార్ల వ్యాపారుల్లో గుబులు రేపింది. ఈనెల 18 నుంచి 26వ తేదీ వరకు జిల్లాలోని జనరల్ -19, కల్లు గీత కార్మికులు-2 చొప్పున మొత్తంగా 21 బార్లకు ఆశించిన స్థాయిలో దరఖాస్తులు రాలేదు. ఇప్పటివరకు జిల్లాలో జనరల్ -19 బార్లకు జిల్లా వ్యాప్తంగా 41 మంది ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. కానీ టెండర్ మాత్రమే ఒక్కటే దాఖలైనట్లు అధికారులు తెలిపారు. మంగళవారం ఆఖరిరోజు కావడంతో భారీగా దరఖాస్తులు వస్తాయని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇప్పటి వరకు ఇప్పటి వరకు 41 మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవికుమార్ తెలిపారు. వీటిలో నంద్యాల-24, నందికొట్కూరు-5, ఆళ్లగడ్డ-1, డోన్-2, బేతంచెర్ల-3, ఆత్మకూరు-5, నంద్యాల-1 ఉన్నట్లు తెలిపారు.

పందుల నుంచి కాపాడాలి

జూపాడుబంగ్లా, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): జూపాడు బంగ్లా గ్రామానికి చుట్టూపక్కల ఉన్న మొక్కజొన్న పంటలను పందులు నాశనం చేస్తున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పందుల నుంచి పంటలను కాపాడాలని సోమవారం తహసీల్దార్ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేశారు. చేతికొచ్చిన పంటలు పందులు నాశనం చేస్తున్నాయన్నారు. అనంతరం తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్, ఎంపీడీవో గోపికృష్ణకు వినతిపత్రం అందజేశారు.

కార్మికులకు పెండింగ్ వేతనాలు ఇవ్వాలి

నంద్యాల రూరల్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : స్వచ్ఛభారత్ కార్మికులకు పెండింగ్ వేతనాలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాగరాజు, యేసురత్నం డిమాండ్ చేశారు. సోమవారం నూనెపల్లె సెంటర్ నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి ధర్నా చేపట్టారు. అనంతరం వినతిపత్రాన్ని జిల్లా పంచాయతీ అధికారి లలితాబాయికి అందజేశారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ వర్కర్స్ మరియు హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు తిమ్మరాజు, సాలయ్య, మద్దయ్య, రామాంజనేయులు, సుభద్రమ్మ, రమాదేవి పాల్గొన్నారు.

మార్క్‌ఫెడ్ గోదాముల తనిఖీ

నంద్యాల ఎడ్యుకేషన్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): నంద్యాల మండలం అయ్యలూరు మెట్ట సమీపంలోని మార్క్‌ఫెడ్ గోదాములను సోమవారం జిల్లా కలెక్టర్ రాజకుమారిగణియా తనిఖీలు చేపట్టారు. గోదాములో నిల్వఉంచిన యూరియా నిల్వలను, ఏయే సంస్థలకు ఎంత సరఫరా చేసిన వివరాలను మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ హరినాథ్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎరువుల దుకాణాల్లో, ప్రాథమిక పరపతి కేంద్రాలు, రైతుసేవాకేంద్రాల్లో యూరియా అమ్మకాలను డీబీటీలో నమోదు చేయించాలని అధికారులను ఆదేశించారు. ఎక్కడ కూడా ఎమ్మార్పీ ధరల కంటే అధిక ధరలకు విక్రయించినా, కృత్రిమ కొరత సృష్టించినా చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. యూరియా గురించి రైతుల్లో ఉన్న అపోహలను తొలగించాలన్నారు. యూరియా నిల్వలపై రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

మహానందిలో ఘనంగా పల్లకీ సేవ

మహానంది, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలో సోమవారం రాత్రి పల్లకిసేవ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా స్వామి,అమ్మవార్ల ఉత్సవమూర్తుల విగ్రహాలను అర్చకులు ప్రత్యేక పల్లకిలో ఆశీనులు గావించారు.అనంతరం వేదమంత్రాలతో పూజలు జరిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి పర్యవేక్షకుడు పసుపుల సుబ్బారెడ్డి, వేదపండితులు పాల్గొన్నారు.

- మహానంది క్షేత్రంలో సోమవారం రాత్రి అటవీశాఖ ప్రిన్సిపల్ చీఫ్ సెక్రటరీ చలపతిరావు కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ సాంప్రదాయం ప్రకారం అలంకార మంటపంలో వీరిని వేదపండితులు శాల్వతో సన్మానించి ఆశీర్వదించారు. ప్రసాదాలు అందజేశారు.

మూడు ఉద్యోగాలకు అర్హత


కుటుంబ సభ్యులతో అరుంధతి

జూపాడుబంగ్లా, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం విడుదల చేసిన డీఎస్సీ ఫలితాల్లో మండ్లెం గ్రామానికి చెందిన రోజా అనే యువతి మూడు ఉద్యోగాలకు ఎంపికైంది. రోజా స్కూల్ అసిసెంట్ సోషల్‌లో 81.18 మార్కులతో జిల్లా 17వర్యాంకు, టీజీటీ సోషల్ రాయలసీమ జోన్లో 78.78 మార్కులతో 11వర్యాంకు, ఎస్‌జీటీ 86.93 మార్కులతో 137వర్యాంకు సాధించారు. మానాన్న ఆటోడ్రైవర్‌గా పనిచేసి నన్ను చదివించాడని, ఆయన కష్టం వృథా కాకుండా చదివి మూడు ఉద్యోగాలకు ఎంపిక కావడం సంతోషంగా ఉందని అన్నారు. తనకు ఆత్మకూరుకు చెందిన ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు సాయం చేశారని ఆమె తెలిపారు.

28న నంద్యాలలో జిల్లా స్థాయి చెస్ పోటీలు

నంద్యాల హాస్పిటల్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): నంద్యాల పట్టణంలో 28న జిల్లా స్థాయి చెస్ పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా సంఘం కార్యదర్శి రామసుబ్బారెడ్డి తెలిపారు. నంద్యాల జిల్లా చెస్ సంఘం ఆధ్వర్యంలో ఉదయం 9గంటలకు రామకృష్ణ డిగ్రీ కాలేజి సమీపంలోని స్వామివివేకానంద ఆడిటోరియంలో జిల్లా స్థాయి ర్యాపిడ్ అండ్ బ్లిట్జ్ విభాగాల్లో పోటీలు నిర్వహిస్తామన్నారు. క్రీడాకారులు 27వ తేదీ సాయంత్రం 6 గంటల్లోపు ఏపీ చెస్ వెబ్‌సైట్‌లో ఎంట్రీలు నమోదు చేసుకోవాలన్నారు.

యూరియా కోసం ఆందోళన వద్దు

- జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్


ఆత్మకూరులో ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న జేసీ


పాములపాడులో ఎరువుల నిల్వలను తనిఖీ చేస్తున్న అధికారులు

ఆత్మకూరు, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): యూరియా కోసం రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం వద్దని జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్ పేర్కొన్నారు. సోమవారం ఆత్మకూరు పట్టణంలోని వసుంధర ఫర్టిలైజర్‌ను ఆయన తనిఖీ చేశారు. అక్కడ రికార్డులను పరిశీలించి అమ్మకాల గురించి ఆరా తీశారు. అదేవిధంగా రైతుల ఫోన్ నంబర్లకు కాల్ చేసి యూరియా అమ్మకాలపై స్వయంగా అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఇప్పటివరకు 41వేల మెట్రిక్ టన్నుల యూరియా జిల్లాకు దిగుమతి అయిందని అన్నారు. అయితే 15వేల మెట్రిక్ టన్నుల వరకు ఆర్ఎస్‌కేలు, సొసైటీలు, డీసీఎంఎస్‌ల ద్వారా రైతులకు అందజేయగా మిగతా యూరియాను ప్రైవేట్ దుకాణాల ద్వారా సరఫరా చేసినట్లు చెప్పారు. అయితే రైతుల చెంతకే ఎరువులను అందించాలన్న ఇక నుంచే ఎరువులను 60 ప్రభుత్వ వ్యవస్థల ద్వారా మిగిలిన 40శాతం ఎరువులను ప్రైవేట్ దుకాణాల ద్వారా అందిస్తామని అన్నారు. అదేక్రమంలో ఇతర ఎరువులు తీసుకుంటేనే యూరియా ఇస్తామన్న షరతులేవి లేదని అన్నారు. అలాంటి చర్యలకు పాల్పడితే దుకాణాలపై చర్యలు తీసుకుంటామని అన్నారు. అనంతరం ఆయన ఆత్మకూరు మండలంలోని ముష్టేపల్లిలోని రైతు సేవా కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈయన వెంట ఆత్మకూరు ఆర్డీవో నాగజ్యోతి, ఏడీఏ హేమలత, తహసీల్దార్ రత్నరాధిక, డిప్యూటీ తహసీల్దార్ ఆంజనేయులు ఉన్నారు. జేసీ పర్యటనలో సీఐ రాము బందోబస్తు చర్యలు చేపట్టారు.

పాములపాడు: పాములపాడులో ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. సోమవారం తహసీల్దార్ సుభద్రమ్మ, ఎస్ఐ సురేశ్, ఏవో మహేశ్వరరెడ్డి సుమంత్ ట్రేడర్స్, తదతర దుకాణాలలో రికార్డులను, గోడౌన్‌లలో ఎరువుల నిల్వలను, స్టాక్ రిజిష్టర్‌లను పరిశీలించారు.

మిడుతూరు: యూరియాను దుర్వినియోగం చేయరాదని ఏడీఏ గిరీష్ రావు సూచించారు. మండలంలోని చౌట్కూరు, కడుమూరు, మిడుతూరు గ్రామాల్లో సోమవారం దుకాణాలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు ఏవో పీరునాయక్ ఉన్నారు.

గడివేముల: మండలంలోని ఎరువుల దుకాణాలను సోమవారం తహసీల్దార్ వెంకటరమణ, ఏవో పవన్‌కుమార్‌లు తనిఖీ చేశారు. దుకాణాల్లోని రిజిస్టర్లను పరిశీలించారు.

జూపాడుబంగ్లా: జూపాడుబంగ్లాలో ఎరువుల దుకాణాలను సోమవారం అధికారులు తనిఖీలు చేశారు. 80బన్నూరు సహకార సొసైటీలో నిల్వ ఉన్న ఎరువులను నందికొట్కూరు రూరల్‌సీఐ సుబ్రమాణ్యం, తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్, ఎంపీడీవో గోపికృష్ణ, ఏఓ కృష్ణారెడ్డి, ఎస్ఐ మల్లికార్జున పరిశీలించారు. రైతులకు ఎటువంటి ఇబ్బందిలేకుండా చూడాలని సూచించారు.

పగిడ్యాల: రైతులకు అవసరమైన ఎరువులను ఎమ్మార్పీ కంటే అధిక రేట్లకు విక్రయిస్తే చర్యలు తప్పవని వ్యవసాయాధికారి మురళీధర్ ఎరువుల దుకాణాల యజమానులకు హెచ్చరించారు. పగిడ్యాల గ్రామంలోని మల్లికార్జున, శ్రీలక్ష్మీ మద్దిలేటి స్వామి ఎరువుల దుకాణాలను, సొసైటిలో నిల్వ ఉన్న ఎరువుల బస్తాలను తహసీల్దార్ శివరాముడు, వ్యవసాయాధికారి మురళీధర్, ఇన్‌చార్జి ఎస్ఐ ఓబులేష్‌లు సోమవారం తనిఖీ చేశారు. ఆయా షాపులలోని రికార్డులను, స్టాక్ వివరాలను పరిశీలించారు.

పాణ్యం: ఎరువుల దుకాణాల్లో ఎకరాకు రెండు బస్తాల యూరియా మాత్రమే అమ్మాలని పాణ్యం తహసీల్దారు నరేంద్రనాథ్‌రెడ్డి ఆదేశించారు. సోమవారం పాణ్యంలోని ఎరువుల దుకాణాలను ఆయనతో పాటు పోలీసు, వ్యవసాయ శాఖ సిబ్బంది ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎకరాకు రెండు బస్తాలే అమ్మాలని సూచించారు. ఒక్కో రైతుకు 30 నుంచి 40బస్తాలు అమ్మడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆర్ఐ రాము, ఏఎస్ఐ నరసింహులు, వీఆర్వో శంకర్, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

కొత్తపల్లి: కొత్తపల్లి, గువ్వలకుంట్ల గ్రామాల్లో ఆత్మకూరు రూరల్ సీఐ సురేశ్ కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం యూరియా పంపిణీ చేశారు. జడ్పీటీసీ సోముల సుధాకరరెడ్డి బండి నాయిని పాలెం గువ్వలకుంట్ల రైతులకు కూడా యూరియా ఇవ్వాలని వ్యవసాయ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తుండగా అక్కడే ఉన్న సీఐ జోక్యం చేసుకొని సమస్యను సద్దు మనిగించారు. మండలంలోని గువ్వలకుంట్ల రైతుల పొలాలు 80 శాతం ఆత్మకూరు మండల పరిధిలో ఉన్నాయని, ఇక్కడ రైతులను ఆత్మకూరు వెళ్లి యూరియా తెచ్చుకోవాలని వ్యవసాయ అధికారులు ఎలా చెప్తారని జెడ్పీటీసీ ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ఒక్కో పాసు పుస్తకానికి ఒక్కయూరియా బస్తా చొప్పున పంపిణీ చేయడం గమనార్హం.

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

పర్యావరణాన్ని కాపాడండి: బీసీ ఇందిరమ్మ



బనగానపల్లెలో మట్టి విగ్రహాలు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకురాలు బీసీ ఇందిరమ్మ

బనగానపల్లె, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలో మట్టి విగ్రహాలను పూజించి పర్యావరణాన్ని కాపాడాలని టీడీపీ నాయకురాలు బీసీ ఇందిరమ్మ కోరారు. నా బనగానపల్లె- నా ఆరోగ్యం కార్యక్రమంలో భాగంగా సోమవారం పట్టణంలోని పెట్రోల్ బంకు కూడలి, పాతబస్టాండ్‌లోని పొట్టి శ్రీరాములు కూడలిలో వినాయక మట్టి విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేశారు. విద్యార్థులకు కూడా మట్టి విగ్రహాలు పంపిణీ చేసి పర్యావరణం ఆవశ్యకతను బీసీ ఇందిరమ్మ వివరించారు. కార్యక్రమంలో బనగానపల్లె సీఐ ప్రవీణ్‌కుమార్, మార్కెట్‌యార్డు చైర్మన్ కాట్రెడ్డి మల్లికార్జునరెడ్డి, గణేశ్ కమిటీ గౌరవ సలహాదారు టంగుటూరు శ్రీనయ్య, అధ్యక్షుడు మల్లారెడ్డి, వేణుగోపాల్, శ్రీరామ వెంకటసుబ్రమణ్యం, శేఖర్, భరతుడు, నాగేశ్, సాయిరాం, ఫణిభూషన్ పాల్గొన్నారు.

కేసీ కాలువ సైడ్‌వాల్ నిర్మాణం



కుప్పకూలిన కేసీ కాలువ సైడ్‌వాల్



కేసీ కాలువకు నిర్మించిన సైడ్‌వాల్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

చాగలమర్రి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామ సమీపంలోని కేసీ ప్రధాన కాలువలో కుప్ప కూలిన సైడ్‌వాల్‌ను నిర్మించారు. 'కూలిన కేసీ కాలువ సైడ్‌వాల్' అన్న శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో కథనాన్ని ప్రచురితమైంది. స్పందించిన కేసీ కెనాల్ ఏఈ జమాల్‌వలి పర్యవేక్షణలో రూ.9.50 లక్షలతో సైడ్‌వాల్ పనులు చేపట్టారు. సైడువాల్ మట్టి కట్ట దెబ్బతినకుండా పనులు వేగవంతం చేశారు. సైడ్‌వాల్ ఏర్పాటుతో గండి ముప్పు తప్పింది.

పండ్ల తోటల సాగుతో సుస్థిర ఆదాయం

సంజామల, ఆగస్టు25(ఆంధ్రజ్యోతి): రైతులకు సుస్థిర ఆదాయానికి పండ్ల తోటలు సాగు మేలు అని ఏపీవో ప్రకాష్ అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వంద శాతం రాయితీతో ప్రభుత్వం పండ్ల తోటల సాగుకు ప్రోత్సహిస్తోందన్నారు. మండల వ్యాప్తంగా 80 ఎకరాల్లో సాగు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. రైతులు పండ్లతోటల సాగుకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

అల్లా మార్గంలో నడవాలి

- మౌలానా ముఫ్తీ అజ్మతుల్లా

ఆళ్లగడ్డ, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): ప్రతి ముస్లిం అల్లాహ్ చూపిన మార్గంలో నడుస్తూ ఆయన కృపకు పాత్రులు కావాలని మౌలానా ముఫ్తీ అజ్మతుల్లా అన్నారు. సోమవారం పట్టణంలోని బృందావనం కాలనీ వద్ద నూతనంగా నిర్మించిన మహ్మదీయ మసీదును ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో మసీదు పెద్దలు, వివిధ ప్రాంతాల మత గురువులు పాల్గొన్నారు.

ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోండి

బేతంచెర్ల, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితిని మత సామరస్యానికి ప్రతీకగా హిందూ, ముస్లింలు ఐక మత్యంతో జరుపుకోవాలని డీఎస్పీ శ్రీనివాస్ సూచించారు. సోమవారం సాయంత్రం సీఐ వెంకటేశ్వరరావు అధ్యక్షతన హిందూ, ముస్లిం పెద్దలతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో విద్యుత్ శాఖ ఏడీ మధుసూదన్‌రెడ్డి, కమిషనర్ హరిప్రసాద్, సీఐ వెంకటేశ్వ రరావు, ఖాజీ నూర్ అహ్మద్, ముర్తుజావలి, ఎస్ఐ రమేశ్‌బాబు, పోలీస్, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి

శిరివెళ్ల, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలను అరికట్టాలని ఆళ్లగడ్డ సీనియర్ సివిల్ న్యాయాధికారి శైలజ అన్నారు. న్యాయ సేవా సంఘం ఆధ్వర్యంలో శిరివెళ్ల లోని జడ్పీ ఉన్నత పాఠశాలలో న్యాయ విజ్ఞాన సదస్సును సోమవారం నిర్వహించారు. న్యాయాధికారి మాట్లాడుతూ బాలికా విద్య, పోక్సో తదితర అంశాల గురించి అవగాహన కల్పించారు. సమావేశంలో ఆళ్లగడ్డ డీఎస్పీ ప్రమోద్, ఏపీపీ శివప్ర సాద్‌రావు, ఏజీపీ కమతం బాలగురెడ్డి, న్యాయవాదులు సుబ్బారెడ్డి, రమాదేవి, రమణయ్య, సీడీపీవో తేజశ్వరి, శిరివెళ్ల సర్కిల్ సీఐ దస్తగిరిబాబు, ఎస్ఐ చిన్నపీరయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

చాగలమర్రిలో క్షుద్రపూజల కలకలం

చాగలమర్రి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని సీఎస్ఐ చర్చి ఎదుట క్షుద్రపూజల కలకలం రేపింది. సోమవారం చర్చి ముఖద్వారం వద్ద గుర్తు తెలియని వ్యక్తులు క్షుద్రపూజలు చేశారు. దీంతో కాలనీవాసులు, చర్చి పెద్దలు ఆందోళన చెందారు. గుర్తు తెలియని వ్యక్తులు క్షుద్రపూజలు చేసి ఉంటారని అనుమానం వ్యక్తం చేశారు. క్షుద్రపూజల విషయం గురించి ఎస్ఐ సురేష్‌కు చర్చి కమిటీ సభ్యులు ఫిర్యాదు చేశారు. చర్చి ముఖద్వారం వద్ద క్షుద్రపూజలు చేసి ఉన్నట్లు ఆనవాళ్లు ఉండటంతో కాలనీవాసులు భయాందోళన చెందుతున్నారు. దీనిపై అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరారు.

భక్తుల కోసం వాటర్‌ప్లాంట్

మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి



మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభిస్తున్న బీసీ రాజారెడ్డి

బనగానపల్లె, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): భక్తులు, ప్రయాణికులు సౌకర్యార్థం వాటర్‌ప్లాంట్‌ను ఏర్పాటు చేయించినట్లు బనగానపల్లె పట్టణ మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి తెలిపారు. పట్టణ శివారులోని అయ్యప్పస్వామి దేవాలయం సమీపంలో తన సొంత నిధులతో ఏర్పాటు చేయించిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను సోమ వారం ఆయన ప్రారంభించారు. తన తల్లిదండ్రులు బీసీ గుర్రెడ్డి, బీసీ లక్ష్మమ్మల జ్ఞాపకార్థం వాటర్‌ప్లాంట్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజలు నీటిని వృథా చేయకుండా పొదుపుగా అవసర మైన మేరకు వాడుకోవాలని కోరారు. కార్యక్రమంలో అయ్యప్ప సొసైటీ కమిటీ సభ్యులు, భక్తులు, ప్రజలు పాల్గొన్నారు.

'చవితి' సందడి

- కొలువుదీరేందుకు సిద్ధంగా ఉన్న వినాయక విగ్రహాలు
- ముస్తాబవుతున్న మండపాలు
- మేళతాళాలతో మండపాలకు చేరుతున్న గణనాథులు
- రేపటి నుంచి ఉత్సవాలు ప్రారంభం
- జాగ్రత్తలు పాటించాలని అధికారుల సూచన

వినాయక చవితి ఉత్సవాలు రేపటి నుంచి ప్రారంభం కానున్నాయి. పట్టణం, గ్రామాల్లో సందడి నెలకొంది. యువకులు, చిన్నారులు పోటాపోటీగా ఏర్పాట్లలో మునిగారు. వివిధ డిజైన్లతో కూడిన విగ్రహాలను ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేసుకున్నారు. వినాయక మండపాల కోసం పందిర్లు ఏర్పాటు చేశారు. గణేశ్ విగ్రహాల కొనుగోలు కోసం అడ్వాన్సులు కూడా ఇచ్చుకున్నారు. కొన్ని చోట్ల విగ్రహాలను మండపాల్లో కొలువుదీర్చారు. ఇప్పటికే పోలీసులు నిర్వాహకులకు సూచనలు, సలహాలు ఇచ్చారు.



ఆళ్లగడ్డలో గణనాథులను గ్రామాలకు తరలిస్తున్న నిర్వాహకులు

డోన్ టౌన్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): డోన్ పట్టణంలోని కొత్తబస్టాండు, యశోద హాస్పిటల్ తదితర ప్రాంతాల్లో వినాయక విగ్రహాల అమ్మకాల సందడి నెలకొంది. చిన్న, మట్టి విగ్రహాల నుంచి పెద్ద విగ్రహాలను కొనుగోలు చేసి పనుల్లో నిమగ్నమయ్యారు.

చాగలమర్రి: మండలంలో వినాయకచవితి ఉత్సవాల సందడి ఆయా గ్రామాల్లో నెలకొంది. వినాయక విగ్రహాలను కొలువుదీర్చేందుకు మండపాలను సిద్ధం చేశారు. ఆళ్లగడ్డ, మైదుకూరు, ప్రొద్దుటూరు తదితర ప్రాంతాల నుంచి వినాయక విగ్రహాలను కొనుగోలు చేసి చాగలమర్రికి తరలించారు. బుధవారం ఆయా విగ్రహాలను ఊరేగింపుగా మండపాల్లో కొలువుదీరుస్తారని ఉత్సవ కమిటీ అధ్య క్షుడు గుత్తి నరసింహులు తెలిపారు.



ఆళ్లగడ్డ: గణనాథులను కొనుగోలు చేసి తరలిస్తున్న భక్తులు

కొలిమిగుండ్ల : మండలంలోని వివిధ గ్రామాల్లో సుమారు 100కు పైగా వినాయక విగ్రహాల ఏర్పాటుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. కొందరు ఇప్పటికే వినాయక విగ్రహాలను సైతం మండపాలకు చేర్చడంతో సందడి వాతావరణం నెలకొంది. రంగురంగుల విద్యుత్ దీపాలతో మండపాలను అత్యంత సుందరంగా తీర్చిదిద్దుతున్నారు.

ఆళ్లగడ్డ: ఆళ్లగడ్డ పట్టణం లోని కందుకూరు రోడ్డులో వినాయక విగ్రహాల కొనుగోలు కేంద్రాల వద్ద సోమవారం సందడి వాతావరణం నెలకొంది. మండలం లోని వివిధ గ్రామాల వినాక కమిటీ వారు విగ్రహాలను కొనుగోలు చేసుకొని మండపాలకు తరలించారు. ఆయా గ్రామాలలో గణనాధుని కొలువు కోసం మండపాలను అలంకరించే పనిలో కార్యనిర్వాహకులు నిమగ్నమయ్యారు. ఆళ్లగడ్డ లోని వివిధ ప్రాంతాలలో ఇప్పటి వరకు 70కి పైగా విగ్రహాలను కొలువు దీరుతున్నట్లు కమిటి సభ్యులు తెలిపారు. ఇప్పటికే పలు ప్రాంతాలలో వినాయక విగ్రహాలను తరలించి మండపాలలో ఉంచారు. మండపాలను విద్యుత్ దీపాలు, పూలతో అందంగా అలంకరించారు. ఈ ఏడాది నుండి వినాయక మండపా లకు విద్యుత్ ను ఉచితంగా ఇస్తుండటంతో కమిటీ సభ్యులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

డోన్ రూరల్ : జై బోలో గణేశ్ మహారాజ్‌కు జై అంటూ వినాయక విగ్రహాలను ట్రాక్టర్లలో, ఆటోల్లో యువకులు, భక్తులు మండపాల వద్దకు తరలిస్తున్నారు. పలు వీధుల్లో గణపతి మండపాలను ఏర్పాటుచేసి సుందరంగా అలంకరిస్తున్నారు. ఇప్పటికే 50పైగా మండపాలు ఏర్పాటు చేశారు. అలాగే గ్రామాల్లో వినాయక ఉత్సవాల సందడి కనిపిస్తోంది. గణపతి మండపాల వద్ద చిన్నారుల సందడి అధికంగా కనిపిస్తోంది.



డోన్‌లో అమ్మకానికి ఉంచిన వినాయక విగ్రహాలు









చాగలమర్రి, కోవెలకుంట్ల, కొలిమిగుండ్ల, ఆళ్లగడ్డలో ముస్తాబవుతున్న వినాయక మండపాలు

ఎరువులు బ్లాక్‌మార్కెట్‌కు తరలిస్తే చర్యలు



గుండుపాపల వ్యవసాయ సహకార సంఘంలో ఎరువుల వివరాలు తెలుసుకుంటున్న సీఐ మురళీధర్‌రెడ్డి, ఏవో ప్రమీల



సంజామల ఎరువుల దుకాణంలో రికార్డులను పరిశీలిస్తున్న తహసీల్దార్ అనిల్ కుమార్

చాగలమర్రి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ఎరువులు బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ సురేష్, ఏవో రంగనేతాజీ హెచ్చరించారు. సోమవారం చాగలమర్రి గ్రామంలోని వాసవీ రైస్‌మిల్, ఎరువుల దుకాణాలను వారు తనిఖీ చేశారు. ఎరువుల స్టాక్ రికార్డులను పరిశీలించారు. యూరియా కొరత సృష్టిస్తే దుకాణం సీజ్ చేస్తామని అన్నారు. కార్యక్రమంలో పశువైద్యాధికాణి దీపకుమారి, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ మురళీకృష్ణ, వీఆర్వో బాబయ్య, వీహెచ్‌ఏ ఫరూక్ ఉన్నారు.

బనగానపల్లె: యూరియాను బ్లాక్‌లో విక్రయించకుండా రైతులకు అందించాలని స్పెషల్ టీం అధికారులు అన్నారు. సోమవారం పట్టణంలోని నాలుగు ఎరవుల దుకాణాలు తనిఖీ చేశారు. ఓ దుకాణంలో సరైన పత్రాలు, రికార్డులు లేకపోవడంతో రూ.12.40లక్షల విలువగల డీఏపీ బస్తాలను సీజ్ చేశారు. తనిఖీల్లో తహసీల్దారు నారాయణరెడ్డి, వ్యవసాయాధికారి సుబ్బారెడ్డి, ఎస్ఐ కల్పన, వీఆర్‌వోలు ఈశ్వర్‌రెడ్డి, మధు, కుళాయప్ప తదితరులు పాల్గొన్నారు.

కొలిమిగుండ్ల: యూరియా అమ్మకాలపై వ్యవసాయ సిబ్బంది జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయశాఖ మండల అధికారి నాగేంద్రప్రసాదు పేర్కొన్నారు. యూరియా విక్రయాలపై స్థానిక రైతు సేవా కేంద్రంలో అధికారులు వ్యవసాయ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో తహసీల్దార్ శ్రీనివాసులు, ఏఎస్ఐ గోవిందనాయక్, ఏఈవో నాగరాజు, వనిత, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

రుద్రవరం: రైతులకు అందాల్సిన యూరియాను పక్కదారి పట్టిస్తే కఠిన చర్యలు తప్పవని ఏవో సుమతి, ఎస్ఐ మహ్మద్‌రఫీ అన్నారు. సోమవారం మండలంలోని ఆలమూరు, అల్లూరు గ్రామాల్లో ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఏఈవో రాజు పాల్గొన్నారు.

సంజామల : ఎరువులు, క్రిమి సంహారక మందులను అధిక ధరలకు విక్రయిస్తే లైసెన్సును రద్దు చేస్తామని తహసీల్దార్ అనిల్ కుమార్ హెచ్చరించారు. సోమవారం సాయంత్రం సంజామలలోని రెండు ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. ఆయా దుకాణాల్లో రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ తులసికృష్ణ, వీఆర్‌వో చెన్నయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

దొర్నిపాడు: మండలంలోని ఆయా గ్రామాల్లో వ్యవసాయ సహకార సంఘాల్లో ఎరువుల దుకాణాల్లో ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని ఆళ్లగడ్డ సీఐ మురళీధర్‌రెడ్డి, వ్యవసాయాధికారి ప్రమీల హెచ్చరించారు. సోమవారం మండలంలోని గుండుపాపల గ్రామంలోని వ్యవసాయ సహకార సంఘంలోని ఎరువులను పరిశీలించారు. అనంతరం ఎరువుల స్టాక్, రిజిస్ట్రర్లు, ఈ-పాసు మిషన్‌లను తనిఖీ చేశారు. కార్యక్రమంలో సొసైటీ సీఈవో వెంకటసుబ్బయ్య, సిబ్బంది ఉన్నారు.

ఒకేసారి మూడు ఉద్యోగాలకు అర్హత



విజయభారతి



చిరంజీవి

రుద్రవరం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఇద్దరు అభ్యర్థులు డీఎస్సీ-2025 ఫలితాల్లో ఒకేసారి మూడు ప్రభుత్వ ఉద్యోగాలకు అర్హత సాధించారు. పలువురికి ఆదర్శంగా నిలిచారు. మండల పరిధిలోని టి. లింగందిన్నెకు చెందిన జీడి విజయభారతి డీఎస్సీ 2025 ఫలితాల్లో మూడు ఉద్యోగాలు సాధించారు. పీజీటీ ఇంగ్లిషు విభాగంలో రాష్ట్ర స్థాయిలో రెండో ర్యాంకు, స్కూల్ అసిస్టెంటు కేటగిరిలో మూడో ర్యాంకు, పీజీటీ విభాగంలో 12వ ర్యాంకు సాధించింది. తల్లి ప్రోత్సాహం అక్క అండతో ఈ విజయం సాధించినట్లు విజయభారతి తెలిపారు. అలాగే రుద్రవరం గ్రామానికి చెందిన చిరంజీవి మూడు ఉద్యోగాలకు అర్హత సాధించారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో పీజీటీ స్కూలు అసిస్టెంటు విభాగంలో, ట్రైన్డ్‌గ్రాడ్యుయేషన్ టీచరు జోన్-4 విభాగంలో 19వ ర్యాంకు, సెకండ్ గ్రేడ్ టీచరు విభాగంలో ఉమ్మడి కర్నూలులో 37వ ర్యాంకు సాధించారు. తన మేనమామ బాలదస్తగిరి ప్రోత్సాహంతోనే ఉద్యోగాలకు అర్హత సాధించినట్లు ఆయన తెలిపారు.

వైద్య విద్యలో సీటు సాధించిన విద్యార్థులు



చల్లా జయ సూర్య
ప్యాపిలి



బి.జయంత్
కొలిమిగుండ్ల

ప్యాపిలి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : పట్టణానికి చెందిన చల్లా రామశేఖర్ బాబు, రాధ దంపతుల కుమారుడు చల్లా జయ సూర్య నీట్‌లో మంచి ర్యాంకు సాధించి కర్నూలు మెడికల్ కళాశాలలో సీటు పొందాడు. స్థానిక సరస్వతి శిశుమందిరంలో పది వరకు చదివాడు. ఇంటర్ డోన్‌లో పూర్తి చేశాడు. నీట్ ఆల్‌ఇండియా స్థాయిలో 14025, రాష్ట్రస్థాయిలో 330 ర్యాంకు సాధించాడు. మంచి ర్యాంకు రావడంతో విద్యార్థికి కర్నూలు మెడికల్ కళాశాలలో సీటు లభించింది. దాంతో తల్లిదండ్రులు, తోటి స్నేహితులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

కొలిమిగుండ్ల : మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ఐదు మంది విద్యార్థులు నీట్‌లో రాణించి వైద్య విద్యలో సీటు సాధించారు. కొలిమిగుండ్లకు చెందిన రవికుమార్ గౌడు కుమారుడు బి.జయంత్ విజయవాడ సిద్దార్థ ప్రభుత్వ మెడికల్ కళాశాలలో సీటు పొందారు. అలాగే పలువురు విద్యార్థులు ఆయా కళాశాలల్లో సీట్లు పొందారు. దాంతో ఆయా కుటుంబాల్లో హర్షం వ్యక్తమవుతోంది.

మట్టి విగ్రహాల తయారీలో దిట్ట శివ

- చిన్నారిని అభినందించిన తహసీల్దారు, ఎస్ఐ



శివను అభినందిస్తున్న తహసీల్దారు, ఎస్ఐ

బనగానపల్లె, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి ఉత్సవాల్లో ఉపయోగిస్తున్న ప్లాస్టర్ ఆఫ్ పారిస్ తో తయారు చేస్తున్న విగ్రహాలు పర్యావర ణానికి విఘాతం కలిగిస్తున్నాయి. దీనివల్ల జీవకోటికి ఇబ్బందులు తలెత్తే ప్రమాదం పొంచి ఉంది. అందువల్ల ప్రతి ఒక్కరూ మట్టి విగ్రహాలనే వినియోగించాలనే సంకల్పంతో టీడీపీ నాయకురాలు, మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి సతీమణి బీసీ ఇందిరమ్మ 'నా బనగానపల్లె, నా ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణకు మట్టి విగ్రహాలను పూజిద్దామని' పిలుపునిచ్చారు. దానిని స్ఫూర్తిగా తీసుకొని పట్టణంలో తెలుగుపేటకు చెందిన శ్రీనివాసులు కుమారుడు శివ మట్టితో గణేశుడి విగ్రహాన్ని సొంతంగా తయారు చేసి అందరికీ ఆదర్శంగా నిలిచాడు. ఈ మట్టి విగ్రహాన్ని తె లుగుపేటలోని బంగారమ్మగుడి వద్ద నిల బెట్టనున్నట్లు చిన్నారి శివ తెలిపారు. మట్టి విగ్రహాన్ని తహసీల్దారు నారాయణరెడ్డి, వ్యవసాయాధికారి సుబ్బారెడ్డి, ఎస్ఐ కల్పన పరిశీలించి చిన్నారిని అభినందించారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటు పడాలని వారు పిలుపునిచ్చారు.

బార్లకు నేటితో గడువు పూర్తి

నంద్యాల, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నూతన మద్యం పాలసీతో బార్ల వ్యాపారుల్లో గుబులు రేపింది. ఈనెల 18 నుంచి 26వ తేది వరకు జిల్లాలోని జనరల్ -19, కల్లు గీత కార్మికులు-2 చొప్పున మొత్తంగా 21 బార్లకు దరఖాస్తులు స్వీకరించగా ఆశించిన స్థాయిలో రాలేదు. ఇప్పటివరకు జిల్లాలో జనరల్ -19 బార్లకు జిల్లా వ్యాప్తంగా 41 మంది ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. కానీ టెండర్ మాత్రమే ఒక్కటే దాఖలైనట్లు అధికారులు తెలిపారు. మంగళవారం ఆఖరిరోజు కావడంతో భారీగా దరఖాస్తులు వస్తాయని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇప్పటి వరకు ఇప్పటి వరకు 41 మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవికుమార్ తెలిపారు. వీటిలో నంద్యాల-24, నందికొట్కూరు-5, ఆళ్లగడ్డ-1, డోన్-2, బేతంచెర్ల-3, ఆత్మకూరు-5, నంద్యాల-1 ఉన్నట్లు తెలిపారు.

తెలుగు గంగ ఈఈగా మురళీకృష్ణ



ఆళ్లగడ్డ, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డ తెలుగు గంగ కాలువ ఎగ్జక్యూటివ్ ఇంజనీర్(ఈఈ)గా మురళీకృష్ణ సోమవారం బాధ్యతలు చేపట్టారు. కడప అన్నమయ్య డివిజన్ లో డీఈఈగా పని చేస్తున్న మురళీకృష్ణకు ప్రభుత్వం పదోన్నతి కల్పించి ఆళ్లగడ్డ ఈఈగా ఉత్తర్వులు జారీ చేశారు. బాధ్యతలు స్వీకరించిన మురళీకృష్ణను తోటి ఇంజనీర్లు, సిబ్బంది అభినందనలు తెలియజేశారు.

పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకోవాలి

చాగలమర్రి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): పింఛన్ కోల్పోయిన దివ్యాంగులు మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో రాజేంద్రప్రసాద్ సోమవారం తెలిపారు. దరఖాస్తు చేసే పింఛన్‌దారులు వ్యక్తిగతంగా అర్జీ రాసి ఆధార్ జిరాక్స్, పింఛన్ రద్దు నోటీసు, పాత సదరన్ సర్టిఫికెట్ తదితర పత్రాలను జత పరిచి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పింఛన్‌దారులు మరోసారి వైద్య పరీక్షలకు హాజరు కావాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

ఆలయానికి ట్రాక్టర్ ట్రాలీ వితరణ

చాగలమర్రి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని బసవన్న కట్టవీధిలో వెలసిన రామాలయానికి రూ.లక్ష విలువ చేసే ట్రాక్టర్ ట్రాలీని కోటపాడు రామాంజనేయులు, వెంకటనర్సమ్మ దంపతులు సోమవారం వితరణ చేశారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు ఆవుల నరసింహప్రతాప్, కమిటీ సభ్యులు గణేష్‌రెడ్డి, నరేష్‌కుమార్‌రెడ్డి, రాఘవ, శ్రీధర్‌రెడ్డి, హరి, సుధాకర్, నవీన్ పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములకు రక్షణ కల్పించలేం

- తహసీల్దార్ శ్రీనివాసులు వివాదాస్పద వ్యాఖ్యలు ..

కొలిమిగుండ్ల, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలో ప్రభుత్వ భూములు, స్థలాలు అధికంగా ఉన్నాయని, వాటికి నిరంతరం రక్షణ కల్పించడం రెవెన్యూ శాఖకు కష్టతరమని తహసీల్దార్ శ్రీనివాసులు వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. కొలిమిగుండ్లలో స్థలాలు, భూముల ఆక్రమణ పెరుగుతోందని, ఓవ్యక్తి నుంచి 81నకిలీ అనుబంధ ఇంటి పట్టాలు పోలీసులు స్వాధీనం చేసుకున్న విషయాలపై సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మీడియా ప్రతినిధులు ప్రశ్నించగా పైవిధంగా స్పందించారు. ప్రస్తుతం ఉన్న రెవెన్యూ సిబ్బందితో ప్రభుత్వ భూములను కాపాడలేమంటూ వ్యాఖ్యానించడం చర్చనీయాంశంగా మారింది.

13 మేక పిల్లలు మృతి

అవుకు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మంగంపేట తండాలో అనుమానాస్పద స్థితిలో 13 మేక పిల్లలు మృతి చెందినట్లు బాధితుడు రత్నానాయక్ సోమవారం తెలిపారు. గ్రామ సమీపంలో చుట్టూ ఇనుప కంచె వేసి 13 మేక పిల్లలను ఉంచారు. సాయంత్రం వచ్చి చూసే సరికి మేక పిల్లలు మృత్యువాతపడ్డాయి. ప్రభుత్వం తనను ఆదుకోవాలని బాధితుడు కోరారు.

ప్యాపిలి : మండలంలోని అలేబాదు తండాలో సోమవారం కుక్కల దాడిలో 30 గొర్రె పిల్లలు మృతి చెందాయి. బాధితుడు రవీంద్ర నాయక్‌కు దాదాపు రూ.1.5లక్షలు నష్టం వాటిల్లింది.

కూటమి ప్రభుత్వంలో రైతే రాజు

శిరివెళ్ల, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వంలో రైతే రాజు అని టీడీపీ మండల కన్వీనర్ కాటంరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. మండలంలోని బోయలకుంట్ల వ్యవసాయ సహకార సంఘం చైర్‌పర్సన్‌గా కాటంరెడ్డి అరుణ, డైరెక్టర్లుగా వెలుగోడు మహేష్, లింగాల వెంకట నారాయణరెడ్డి సోమవారం ప్రమాణస్వీకారం చేశారు. అలాగే శిరివెళ్ల సహకార సంఘం చైర్‌పర్సన్‌గా కొండమడుగుల శ్రీనివాసరెడ్డి, డైరెక్టర్లుగా సూరా శ్రీనివాసులు, పేరుసోముల మధుసూదన్ ప్రమాణస్వీకారం చేశారు. నూతన చైర్‌పర్సన్స్, డైరెక్టర్లను సిబ్బంది, టీడీపీ నాయకులు, కార్యకర్తలు సత్కరించారు.